
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 13 మార్చి 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:20 (బుధ)
సహరి : 4:50 (గురు)


ఉప్పుటేరు వద్ద పడవను పరిశీలిస్తున్న అధికారులు

అనుమతులు వచ్చే వరకు నడపవద్దు

ఉప్పుటేరుపై పడవ నిలుపుదల చేసిన అధికారులు

కలిదిండి, మార్చి 12 : పెదలంక పల్లిపాలెంలో ఉప్పుటేరుపై అనుమతులు లేకుండా నడుపుతున్న పడవను మంగళ వారం నిలుపుదల చేశారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 11న ప్రచురితమైన "ప్రయాణం ప్రమాదం" శీర్షికన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డీవో ఖాజావలి, తహసీల్దార్ వంశీ, ఈవోపీఆర్‌డి రాజారావుల ఆదేశాల మేరకు వీఆర్వో జగన్, పంచాయతీ కార్యదర్శి నాగబాబు ఉప్పుటేరు వద్దకు వెళ్లి ప్రయాణికులను చేరవేస్తున్న పడవను నిలుపుదల చేశారు. అనుమతులు పొందే వరకు పడవ నడపవద్దని పడవ యజమానికి హెచ్చ రికలు జారీ చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పోలవరంలో వెలుగుతున్న వీధి దీపాలు

చీకట్లు తొలగాయి

పోలవరంలో పంచాయతీలకు విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరణ

పోలవరం, మార్చి 12 : పోలవరం మండలానికి వెలుగొచ్చింది. బిల్లులు కట్టకపోవడంతో మండలంలో పంచాయతీలకు తొలగించిన విద్యుత్ కనెక్షన్లు అధికారులు పునరుద్ధరించారు. మంగళవారం మండ లంలో అన్ని పంచాయతీలలో వీధి దీపాలు వెలిగాయి. 'చీకట్లో ఊళ్ళు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. పోలవరం మండలంలో పోలవరం, గూటాల, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, ఇటుకలకోట, వింజరం, ప్రగడపల్లి ఎల్లండిపేట గ్రామ పంచాయతీల పరిధిలో వీధి లైట్లు వెలగడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఏఈ సత్యన్నారాయణ మాట్లాడుతూ మండ లంలో నాలుగు పంచాయతీలు మాత్రమే ఇప్పటివరకూ బిల్లులు చెల్లించాయని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పంచాయతీల వద్ద అండర్ టేకింగ్ లెటర్లు తీసుకుని విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు తెలిపారు.


కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు

వైభవంగా పెద్దింటమ్మ జాతర

కైకలూరు, మార్చి 12: కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మ వారి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగు తున్నాయి. రెండోరోజు మంగళవారం శ్రీజలదుర్గ పెద్దింటి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నూతన వస్త్రా లంకరణ, పుష్పాలంకరణ, ప్రథమావరణ పూజ, కలశ పూజలను అర్చకులు నిర్వహించారు. అమ్మవారికి పుష్పా లంకరణ, వస్త్రాలంకరణ సయ్యపురాజు గుర్రాజు, జానకి దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం కైకలూరు శ్రీషిర్డిసాయి మహిళా బృందం చేసిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులను చెల్లించుకున్నారు. రాత్రి నాట్యకళా అకాడమీ నేషనల్ అవార్డు గ్రహిత కురేళ్ళ జ్యోతి ఆధ్వర్యంలో చేసిన కూచిపూడి, భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఈవో గోపాలరావు ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

'పది' ప్రశ్నపత్రాల బండిళ్ల పంపిణీ

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 12 : పదోతరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాల బండిళ్లను మంగళవారం ఏలూరు సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్ నుంచి జిల్లాలోని అన్ని స్టోరేజి పాయింట్లకు పంపిణీ చేశారు. వీటిని ఆయా పరీక్షా కేంద్రాలకు సమీపంలో వున్న 51 పోలీసు స్టేషన్‌లలో భద్రపరిచారు. పరీక్షలు ఈ నెల 18 నుంచి 30 వరకు జరుగనున్న విషయం విదితమే. పరీక్షల సామాగ్రి పంపిణీలో డీఈవో అబ్రహం, పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్, రూట్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ఒంటిపూట బడులు ?

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 12 : ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలలకు ఈ నెల 18 నుంచి ఒంటి పూట బడులు వర్తింపజేయనున్నట్టు సమాచారం. ఈ మేరకు ఓ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు మంగళవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలుసుకుని చేసిన అభ్యర్థన మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. అయితే దీనిపై ఇంతవరకు అధికారిక ఉత్తర్వులేవీ తమకు అందలేదని జిల్లా విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

రైల్వే స్టేషన్ల ఆధునీకరణ

వర్చువల్‌గా శంకుస్థాపనలు చేసిన ప్రధాని మోదీ

ఏలూరులో జరిగే కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ నజీర్

ఏలూరు క్రైం/ తాడేపల్లిగూడెం రూరల్/ నరసాపురం,మార్చి 12 : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశంలోని పలు రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులకు మంగళ వారం వర్చువల్ విధానంలో శంకుస్థాపనలను చేసి జాతికి అంకితం చేశారు. ఇందులో భాగంగా ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ గూడ్స్ షెడ్డు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఏలూరు రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్డు ప్రాంతంలో కూడా ప్రధాని పలు అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకు స్థాపనలు చేశారు.తొలుత జిల్లా పోలీస్‌ల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎపాటిల్ పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. గూడ్స్‌షెడ్డు వద్ద చేపట్టిన అభివృద్ధి పనుల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు కనక మేడల రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, దక్షిణ మధ్య రైల్వే ఎజీఎం ధనుంజయులు, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కె ఖాజావలి పలువురు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన వన్ స్టేషన్ వన్ ప్రోడక్ట్ స్టాల్‌ను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు, కర్రి ప్రభాకర బాలాజి, కోట రాంబాబు, దత్తు ప్రసాద్, డీఎఫ్ఎం వెంకట రమణ, ఇన్‌చార్జ్ కోఆర్డీనేటర్ దానయ్య, స్టేషన్ మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. చిరు వ్యాపారాలు, ఆ ప్రాం తంలో పేరుగాంచిన వస్తువులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో రైల్వే ప్రవేశ పెట్టిన వన్‌స్టేషన్, వన్ ప్రోడక్ట్ పథకాన్ని చిరు వ్యాపారులు సద్వినియోగ పర్చుకోవాలని నరసాపురం ఎస్ఎం దివాకర్ అన్నారు. మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి రైల్వే ప్లాట్ ఫారంపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. ప్లాట్‌ఫారాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌కు నామమాత్రపుఅద్దె మాత్రమే వసూలు చేస్తామన్నారు. పీవీఆర్, మునికోటి వెంకటేశ్వరావు, శిరిషా, కంచర్ల నాగేశ్వరావు, రాము తదితరులు పాల్గొన్నారు.


ఏలూరులో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

పొత్తు సరే.. సీటెక్కడ ?



ఎన్నికల పొత్తులో భాగంగా సీట్ల ఖరారు, అభ్యర్థుల పేర్ల విడుదలలో ఇప్పటికే ఒక స్పష్టతున్నా కేటాయించిన సీట్ల సంఖ్య క్లారిటీగా వున్నా అవి ఎక్కడా, ఏమిటనేదే ఇప్పటికీ తేలలేదు. సర్దుకుపోయే తత్వంతో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు వ్యవహ రిస్తుండడంతో ఒకింత గజిబిజి గందరగోళం ఏర్పడింది. ఎంపీ స్థానాల విషయంలో కూడా ఇలాంటి పరిస్థితే తొంగి చూస్తోంది. ఒక స్పష్టతతో కూడిన ప్రకటన మరో 48 గంటల్లో వెలు వడవచ్చని ఇప్పటికే సంకేతాలు అందుతున్నాయి.

- ఎంపీ స్థానాల్లో దాగుడుమూత
- ఏలూరులో తపన చౌదరికి నిరాశ
- ఇండిపెండెంట్‌గా బరిలోకి ?
- నరసాపురంలో రఘురామా, వర్మా?
- బీజేపీలో ఎగుడు దిగుళ్లు
- జనసేన సీట్లలోనూ కొత్త రాగాలు
- గురువారం నాటికి పూర్తి ముఖచిత్రం


తపన చౌదరి
సుజనా చౌదరి
రఘురామ కృష్ణంరాజు

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మూడుపార్టీల పొత్తులో భాగంగా నరసాపురం, ఏలూరు లోక్‌సభ స్థానాల విషయంలో ఒక క్లారిటీకి రాకపోవడంతో కేడర్‌లో తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఏలూరు లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తే ఈ స్థానం నుంచి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి ఆశించారు. మూడు రోజుల పాటు సాగిన సుదీర్ఘ కసరత్తులో ఏలూరుకు బదులుగా నరసాపురంను బీజేపీ ఎంచుకుంది. దీనితో తపన చౌదరి తీవ్ర నిరాశకు గురయ్యారు. తన భవిష్యత్ కార్యాచరణ కోసం ఈనెల 15న ఏలూరులో ఆత్మీయ సమావేశం నిర్వహించాలని ఆయన ఇప్పటికే నిర్ణయించారు. వాస్తవానికి ఆర్ఎస్ఎస్ ప్రతి నిధిగా తనకు ఏలూరు నుంచి అవకాశం ఇస్తారని భావించి ఆది నుంచి ఆయన ఈ లోక్‌సభా స్థానంలో విస్తృతంగా సేవ లందించారు. తీరా పొత్తులు తెరముందుకు వచ్చిన తర్వాత సీన్ కాస్తా మారింది. తపనా చౌదరితో పాటు సుజనా చౌదరి పేరు కూడా ప్రముఖంగా తెరముందుకు వచ్చింది. తాజా పరిణామాలు సోమవారం అర్ధరాత్రి వరకు సాగాయి. బీజేపీ పెద్దలు సుదీర్ఘంగా మంతనాలు సాగించి ఆఖరుకు ఏలూరు మీద ఆశ వదులుకునే రీతిగా సంకేతాలిచ్చారు. అప్పటివరకు పూర్తి ధీమాతో ఉన్న తపన చౌదరి డైలమాలో పడడంతో పాటు ఒకింత అసంతృప్తికి గురైనట్లు సమాచారం. లోక్‌సభ స్థానం నుంచి పోటీకి అవకాశం లేక పోయినా ఆయనను ఉంగుటూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే స్థానానికి పోటీకి నిలబెడతారంటూ విస్తృత ప్రచారం సాగింది. కానీ ఇప్పటికే ఆ నియోజకవర్గంలో జనసేన అన్ని ఏర్పాట్లు చేసు కుంటోంది. ఇప్పటికే టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజ నేయులును త్యాగాలకోర్చమని చెప్పి జనసేనకు క్లియర్ చేస్తే మధ్యలో బీజేపీకి ఈ స్థానం ఎలాగని ఇప్పటికే సందేహాలు. మొత్తం మీద ఏలూరు లోక్‌సభ స్థానం చేయి దాటుతున్నా తపన చౌదరి ఆయన అనుచరులు కీలక నిర్ణయాలకు దిగు తారని కొందరంటుంటే, ఇండిపెండెంట్‌గా ఎంపీ స్థానానికి పోటీ చేస్తారని ఇంకొందరు అంచనా వేస్తున్నారు. ఏలూరు స్థానం ఆశించిన సుజనా చౌదరి మంగళవారం ఢిల్లీలోనే మకాం వేసి బీజేపీ పెద్దలతో భేటీకి ప్రయత్నిస్తున్నారు.

ఏలూరుపై టీడీపీలో కదలిక

ఏలూరు లోక్‌సభ తెలుగు దేశం జాబితా పరిధిలోకి రావ డంతో ఆ మేరకు టీడీపీలోనూ కదలిక వచ్చింది. భాష్యం విద్యాసంస్థల అధిపతి రామకృష్ణ అభ్యర్థిత్వం ఇప్పటికే టీడీపీ పరిశీలనలో ఉంది. దీనికి తగ్గట్లుగానే రామకృష్ణ సైతం పార్టీ నుండి సిగ్నల్ రాగానే తదనుగుణంగా రంగంలోకి దిగేం దుకు దాదాపు అన్నీ సమకూర్చుకున్నారు. నిన్న మొన్నటి దాకా ఏలూరు స్థానం విషయంలో దోబూచులాట సాగడంతో మంగళవారం నుంచి ఈ స్థానంపై క్లారిటీ రావడంతో టీడీపీలో ఇప్పుడు ఆసక్తి పెరిగింది. భాష్యం రామకృష్ణతో పాటు, డాక్టర్ పవన్ పేరు చాన్నాళ్ల నుంచి వినబడుతోంది. పార్టీకి నమ్మినబంటుగా వున్న పవన్‌ను రంగంలోకి దింపు తారని పార్టీ సీనియర్లు కొందరు ఇప్పటికే అంచనా వేశారు.. ఆశావహుల జాబితాలో నిన్నమొన్నటి దాకా సాగిన గోరు ముచ్చు గోపాల యాదవ్, కంభంపాటి రామ్మోహన్ భవి తవ్యం కూడా తేలబోతోంది. దీనిపై తెలుగుదేశం గురువారం సాయంత్రం నాటికి తుది నిర్ణయానికి వస్తుందని చెబు తున్నారు. ఇప్పటికే వైసీపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన కారుమూరి సునీల్ కుమార్ రంగంలో ఉండడంతో టీడీపీ కూడా ఆచితూచి అడుగులేస్తోంది. మాజీ ఎంపీ మాగంటి బాబుకు ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పిస్తున్నారని చెబుతున్నారు. ఇదిలా వుండగా నరసాపురం లోక్‌సభ స్థానం బీజేపీకి కేటాయించినట్లు ఆ పార్టీ వర్గాల సమాచారం. ఈ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారనే అంశంపైనే ఎడతెగని ఉత్కంఠ కొనసాగుతోంది. బీజేపీ, టీడీపీ పక్షాల్లో ఇక్కడి నుంచి సిటింగ్ ఎంపీ రఘురామ కృష్ణంరాజు పోటీ చేస్తారనే దానిపై ఇప్పటికే తీవ్ర సస్పెన్స్ కొనసాగుతోంది. రఘురామ కృష్ణంరాజు కూడా ఢిల్లీలోనే ప్రస్తుతం ఉన్నారు. బీజేపీ పెద్దలు రెండురోజులపాటు జనసేన, టీడీపీ అధి నేతలతో సుదీర్ఘ మంతనాలు నెరపిన తర్వాత వారంతట వారుగా ఒక క్లారిటీకి వచ్చారని నివేదికను కేంద్ర కమిటీకి అందిస్తారని బీజేపీ వర్గాల సమాచారం. అయితే పార్టీకి సుదీర్ఘకాలం నుంచి కష్టించి పనిచేస్తూ క్రియాశీలకంగా ఉన్న భూపతిరాజు శ్రీనివాసవర్మ, పాకా సత్యనారాయణ పేర్లు నరసాపురం నుంచి ఇప్పటికే పరిశీలనలో వున్నాయి. ఒకవేళ నరసాపురం కాకపోతే ఏ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తా రంటూ శ్రీనివాసవర్మను పార్టీ నాయకత్వం ఆరా తీసింది. దీనిపై వర్మ సైతం తన మనసులోని మాటను వారి చెవిన వేశారని, దీనికి తగ్గట్టుగానే పార్టీ స్పందించబోతోందని కేడర్ భావిస్తోంది. ఇక నరసాపురంలో రఘురామకృష్ణంరాజా, శ్రీని వాసవర్మా అనే ఇద్దరి మధ్యే పోటీ సాగుతోంది. రఘు రామకృష్ణంరాజు ఏ పార్టీ తరఫున పోటీ చేస్తారనేదే గడచిన వారం రోజులుగా అన్ని పార్టీల్లోనూ ఉత్కంఠ నెలకొంది.

అసెంబ్లీ సీట్ల సంగతేంటి ?

ఇప్పటికే జనసేన పొత్తులో భాగంగా తనకు కేటాయించిన అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు దాదాపు కసరత్తు కొలిక్కివచ్చింది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే విషయం ఇప్పటికీ రహస్యమే. ఈ స్థానం నుంచి పోటీకి వీలుగా కొన్నాళ్ళ క్రితమే అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. ఈ మధ్యనే పవన్ అసెంబ్లీకి కాదు పార్లమెంట్‌కు వెళ్తారంటూ విస్తృత ప్రచారం సాగింది. ఒకవేళ ఇదే నిజమైతే ఇప్పటికే పవన్ తనంతట తానుగా ఒక క్లారిటీ ఇచ్చి వుండేవారు. తాజాగా భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు పవన్ సమక్షంలో మంగళవారం జనసేనలో చేరారు. భీమవరంలో వున్న తాజా రాజకీయాలను పవన్ నేరుగా ప్రస్తావిస్తూ భీమవరం వైసీపీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌పై విరుచుకుపడ్డారు. అక్కడ జగన్ పోవాలి... భీమవరంలో గ్రంధి పోవాలంటూ పిలుపునిచ్చారు. మరోవైపు భీమవరం నాదేనంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనను ఇక్కడ గెలిపించుకోవడమే లక్ష్యంగా పవన్ కామెంట్లు వున్నాయని పార్టీవర్గాలు చెబుతున్నాయి. అలాగే పొత్తులో భాగంగా పార్టీకి దక్కిన నియోజకవర్గాల్లో కూడా ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. పోలవరం నియోజకవర్గం దాదాపు జనసేనకే కేటాయించినప్పటికీ తెలుగుదేశం స్థానిక కేడర్ మాత్రం ఇంకా పోలవరంపైనే ఆశతో ఉంది. పార్టీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌కు అనుకూలంగా అనేకమంది ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఏలూరు నియోజకవర్గంలో పార్టీ కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడును బుజ్జగించే ప్రయత్నాలు సాగుతున్నాయి. పవన్‌ను నేరుగా కలిసి తమ రాజకీయ భవిష్యత్‌కు అనువైన హామీ పొందేందుకు వీలుగా ఇప్పటికే అప్పలనాయుడు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి అనుగుణంగా ఒకరోజు ఆమరణ దీక్షకు సిద్ధమవగా, పార్టీ సీనియర్ నేత బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం నాయుడును బుజ్జగించడంతో దీనిని కాస్తా ఆయన వాయిదా వేసుకున్నారు. నిడదవోలు నుంచి పార్టీ అభ్యర్థిగా కందుల దుర్గేష్‌ను ఇప్పటికే ప్రకటించారు. నరసాపురం స్థానం నుంచి బొమ్మిడి నాయకర్ అభ్యర్థిత్వానికి సానకూలంగానే వున్నా మిగతా అభ్యర్థులతో పాటే ఆయన పేరూ ప్రకటించే అవకాశం ఉంది. ఈ నియోజకవర్గంలో మిగతా వర్గాలను కలుపుకుపోవడానికి వీలుగా సీనియర్ నేత కొత్తపల్లి సుబ్బారాయుడు ఈ మధ్యనే పార్టీలో చేర్చుకున్నారు. ఒకవేళ మార్పులు చేర్పులూ జరిగితే కొత్తపల్లికి కూడా అవకాశం రావచ్చునని సోషల్ మీడియాలో ఊదరగొడు తున్నారు. ఉంగుటూరు స్థానాన్ని జనసేనకు కేటా యించినా ఈ నియోజకవర్గంలో ఉన్న రాజకీయ స్థితిగతులు, బలాబలాలను దృష్టిలో వుంచుకుని తమకే కావాలంటూ టీడీపీ కేడర్ ఇప్పటికీ పట్టుబడుతోంది.ఇంకోవైపు బీజేపీకి కేటాయిస్తారంటూ ప్రచారం జోరందుకుంది. అయినా జనసేన తరఫున నియోజకవర్గ కన్వీనర్ ధర్మరాజు మాత్రం ఎన్నికలకు వీలుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మిగతా స్థానాల సంగతేంటి ?

పొత్తులో భాగంగా కైకలూరు స్థానాన్ని బీజేపీకి కేటాయించడం దాదాపు ఖాయమైంది. ఇక్కడనుంచి ఇప్పటికే మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ విస్తృత ప్రచారానికి వీలుగా గ్రామ గ్రామాన పర్యటిస్తున్నారు. అన్ని పక్షాలకు చెందిన నేతలు ఆయనతో భేటీ అవుతున్నారు. సుదీర్ఘ కాలంగా శ్రీని వాస్‌తో ఇక్కడి నేతలు సాన్నిహిత సంబంధాలు కలిగి ఉండడంతో ఆయన నేరుగా నియోజకవర్గంలో దూసుకు పోతున్నారు. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలుండగా, రెండింటిలో జనసేన, ఒకదానిలో బీజేపీ దాదాపు ఖరారైంది. ఇక తుది క్షణంలో మార్పులు చేర్పులుంటే తప్ప, ఎలాంటి ఊహించని పరిణామాలు సంభవించవని భావిస్తున్నారు.

బడేటి విజయానికి సమష్టిగా కృషి చేయాలి

అప్పలనాయుడితో మాట్లాడిన బొలిశెట్టి



ఏలూరు కార్పొరేషన్, మార్చి 12 : తెలుగు దేశం, జనసేన పార్టీ అధిష్టానాలు నిర్ణయిం చిన ప్రకారం ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బడేటి చంటి పోటీ చేస్తున్నారని ఆయన విజయానికి సమిష్టిగా కృషి చేయాలని జనసేన తాడేపల్లి గూడెం ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అధిష్టానం నుంచి పిలుపు రాకపోతే ఈనెల 14వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని జనసేన ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి అప్పలనాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పవన్ కల్యాణ్ బొలిశెట్టి శ్రీనివాస్‌ను అప్పల నాయుడుతో మాట్లాడమని చెప్పడంతో మంగళవారం ఏలూరు వచ్చి ఆయనతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జనసేన-టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం అప్పలనాయుడుకు మంచి ప్రాధాన్యం లభిస్తుందని హామీ ఇచ్చారు. దీంతో అప్పలనాయుడు నిరాహార దీక్షను విరమించినట్టు ప్రకటిం చారు. జనసేన నాయకులు బి.వి.రామవయ్యాచౌదరి, నాగిరెడ్డి కాశీ నరేష్, ఒబిలిశెట్టి శ్రావణ కుమార్ గుప్త, సిరిపల్లి ప్రసాద్, బొత్స మధు, రెడ్డి గౌరీశంకర్ ఉన్నారు.

జనసేనలో అంజిబాబు

భారీ ర్యాలీతో మంగళగిరికి

భీమవరం, మార్చి 12 : భీమవరం మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ నాయకుడు పులపర్తి రామాంజ నేయులు (అంజిబాబు) జనసేన పార్టీలో చేరేందుకు తన అనుచరు లతో కలిసి భారీ ర్యాలీగా మంగళవారం భీమవరం నుంచి మంగళగిరి బయలుదేరి వెళ్లారు. ఉండి రోడ్‌లోని తన కార్యాలయం దగ్గర నుంచి 100 వాహనాలపై ఇరు పార్టీల నాయకులతో కలిసి వెళ్లారు.అంతకు ముందు ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితుడై జనసేనలో చేరుతున్నానని చెప్పారు. పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి పోటీ చేస్తే ఆయన విజయానికి కృషి చేస్తానన్నారు. మరోచోట పోటీ చేస్తే తానే పోటీకి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పార్టీ ప్రోటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమల రావు(బాబి) మాదాసు కనకదుర్గ, గంటా త్రిమూర్తులు, బొక్క సూరిబాబు, ఉండపల్లి రమేష్ నాయుడు, చల్లా రాము, చంద్రమోహన్, నసీమ బేగం, పలువురు అభిమానులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అంజిబాబును అభినందించారు.




చేయూత కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ తొలగించిన దృశ్యం

ఈ పరిస్థితి ఏ ఎమ్మెల్యేకు రాకూడదు

ఫ్లెక్సీ తొలగింపుపై ఎలీజా ఆవేదన

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 12 : వైసీపీ తలపెట్టిన 4వ విడత చేయూత కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఫ్లెక్సీ తొలగించడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఫ్లెక్సీ తొలగించే దౌర్భాగ్యపు పరిస్థితి ఏ ఏమ్మెల్యేకు రాకూడదని అన్నారు. మొన్న చింతలపూడిలో అవమానించారని, నేడు జంగా రెడ్డిగూడెంలో అవమానించారని తనకు జరుగుతున్న పరిస్థితిని పార్టీ పెద్దల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకు వెళుతున్నానన్నారు. ఎన్ని ఫ్లెక్సీలు తొలగించినా పర్వాలేదని తాను ప్రజల గుండెల్లో ఉన్నానని అన్నారు.

ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి

జడ్పీ సీఈవో, ఎంసీసీ జిల్లా నోడల్ అధికారి కెఎస్ఎస్ సుబ్బారావు

ఏలూరుసిటీ, మార్చి 12:జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండా లని జడ్పీ సీఈవో, జిల్లా నోడల్ అధికారి సుబ్బారావు చెప్పారు. జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమి షనర్లు, మండల/ మున్సిపాల్టీ స్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ప్రణాళికా బద్ధంగా చేయాల్సిన కార్యకలాపాల జాబితాను తయారు చేసుకోవాలన్నారు. మంగళవారం ఎంపీ డీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులకు సర్క్యు లర్‌ను జారీ చేశారు. క్షేత్రస్థాయిలో వీటి అమలుకు అవసరమైన సిబ్బందిని నియామకం చేసుకుని వారిని ప్రవర్తనా నియమావళిపై శిక్షణలో పూర్తి అవ గాహన కల్పించాలన్నారు.అభ్యంతరకరమైన పోస్టర్లు, ప్రకటనలు,బహిరంగ స్థలాల్లో ఇప్పటికే ఏర్పాటు చేయబడిన ఫ్లెక్సీలను గుర్తించి వాటి తొలగింపునకు ముందు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలను తాత్కాలికంగా తొలగించాలన్నారు. ఎన్నికల కమిషన్ వారు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే కమిషన్ సూచించిన ప్రకారం 72 గంటల్లో క్షేత్ర స్థాయిలో చర్యలు చేప ట్టాలన్నారు. ప్రభుత్వ కార్యా లయం, కార్యాలయం భవనం ఉన్న క్యాంపస్‌లోని ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్, పోస్టర్లు/ పేపర్లు లేదా మరేదైనా ఇతర రూపంలో కటౌట్, హోర్డింగ్స్ బ్యానర్లు , జెండాలు మొదలైన వాటిని ఎన్నికల ప్రకటన వెలువడిన 24 గంటల్లోగా తొలగించా లన్నారు. ప్రైవేట్ ఆస్తి వద్ద ప్రదర్శింపబడే అన్ని అనధికార రాజకీయ ప్రకటనలు, స్థానిక చట్టం, కోర్టు ఆదేశాలకు లోబడి, ఏదైనా ఉంటే , కమిషన్ ఎన్ని కల ప్రకటన నుండి 72 గంటల లోపు తొలగిం చాల న్నారు. మండల,మున్సిపల్ స్థాయిలలో మండల పరి షత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు నియమావళి వివరాలను క్షేత్రస్థాయిలో అధికారు లందరికీ తెలియజేసి నియమావళి అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. సి విజిల్ మొబైల్ యాప్ నుంచి వచ్చు ఫిర్యాదులను జిల్లా ఎన్నికల అధికారి వారు, జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించుట జరుగుతుందన్నారు.

ఇదేం ఎన్నికల ట్రైనింగ్ ? టైమింగ్..?

మండిపడుతున్న ఉపాధ్యాయులు



ఏలూరు, మార్చి 12: ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించవలసిన ఎన్నికల ప్రక్రియను అధికారులు గందరగోళం చేస్తున్నారు. ఎన్నికల శిక్షణా కార్యక్రమా లను కుదించి కేవలం మూడు గంటలు మాత్రమే నిర్వహించాలంటూ చేసిన అనాలోచిత ఉత్తర్వులపై ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి. బుధవారం ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో నారాయణపురం ఉన్నత పాఠశాలలో నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాలకు చెందిన సుమారు 400 మంది ఉపాధ్యాయులకు ముందస్తు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆయా మండలాల్లో ఉన్నత పాఠశాలలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లకు పీవో, ఏపీవో డ్యూటీలు పడేవారికి తొలి దశ ట్రైనింగ్ ఏర్పాటు చేశారు. శిక్షణలో భాగంగా తొలిబ్యాచ్‌లో 200 మంది ఉపాధ్యాయులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటలకు మరో 200 మందికి రెండో బ్యాచ్ కింద శిక్షణ కోసం షెడ్యూల్ ఇచ్చారు. ఉదయం శిక్షణ పూర్తయిన ఉపాధ్యాయుడు శిక్షణ అనంతరం మధ్యాహ్నం ఆయా పాఠశాలలకు హాజరవ్వాలని, మధ్యాహ్నం ట్రైనింగ్ పొందేవారు ఉదయం పాఠశాల విధులకు హాజరై మధ్యాహ్నం భోజన పథకం అమలు చేసి 2 గంటలకు శిక్షణకు రావాలని పేర్కొన్నారు.ఇదెలా సాధ్యమని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.నిడమర్రు మండలం చానమిల్లి, బావాయి పాలెం ఉన్నత పాఠశాల నుంచి నారాయణపురం సుమారు 25 కిలోమీటర్ల దూరం మండుటెండలో ప్రయాణించి ఎలా హాజరవ్వాలని ఆందోళన చెందు తున్నారు. అలాగే భీమడోలు మండలం మల్లవరం నుంచి 34 కిలోమీటర్ల దూరంలో గల నారాయణపురానికి గంటన్నరలో ఎలా వెళ్లి రాగలమంటూ ఆవేదన చెందుతున్నారు. ఇన్నేళ్ల ఎలక్షన్ డ్యూటీల శిక్షణలో ఎప్పుడూ ఈవిధంగా జరగలేదని రెండు రోజులపాటు రెండు దఫాలుగా శిక్షణ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరుతున్నారు.


సభ ప్రధాన గేటుకు తాళం వేసిన దృశ్యం

మంత్రి సభ కోసం తీసుకొచ్చి తాళం వేశారు

ద్వారకాతిరుమల, మార్చి 12: రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్ఆర్ చేయూత కార్యక్రమానికి హాజరైన మహిళలు మంగళవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పలు గ్రామాల్లోని నాయకులు మహిళలను మినీ లారీల్లో తీసుకొచ్చారు. వారంతా ప్రాంగణానికి చేరాక ప్రధానగేట్లకు తాళాలు వేసేశారు. అక్కడ నీటి సౌకర్యం, టాయిలెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 4-30 గంటల ప్రాంతంలో చేరుకున్న మంత్రి మాట్లాడటానికి ముందే పలువురు మహిళలు పక్క నున్న గేట్ ద్వారా బయటకు పరుగులు తీశారు. ఆ తరువాత సభను ప్రారంభించిన మంత్రి వనిత 4204 మందికి రూ.7,88,25,000 చెక్కు అందజేశారు. సభ పూర్తయిన వెంటనే విందు భోజనాలను ఆరగించారు.


వేరే మార్గం ద్వారా వెళ్లిపోతున్న మహిళలు

సీబీఎస్‌ఈ పరీక్షలకు ఎన్నికల శిక్షణ తరగతుల అడ్డంకి

» పరీక్షలకు ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం : డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 12 :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సీబీఎస్‌ఈ పాఠశాలల్లో ప్రస్తుతం జరుగుతున్న వార్షిక పరీక్షల నిర్వహణపై సార్వత్రిక ఎన్నికల శిక్షణ తరగతుల ప్రభావం పడుతోంది. ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌తో కూడిన సీబీఎస్‌ఈ పాఠశాలల్లో సోమవారం నుంచి శనివారం వరకు 8, 9 తరగతుల విద్యార్థులకు వార్షికపరీక్షలు నిర్వహిస్తున్న విషయం విదితమే. జిల్లాలో ఈ పాఠశాలలు 36 ఉండగా, ఇప్పుడు పరీక్షలు జరుగుతున్న 8, 9 తరగతుల బాలబాలికలు వందలసంఖ్యలోనే ఉన్నారు. ఇప్పటికే రెండుపరీక్షలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల విధులకు నియమితులైన ఉపాధ్యాయులందరూ బుధవారం ఆయా మండలాల్లో నిర్వహించే తొలివిడత ఎన్నికల శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని జాబితాలను పంపారు. ఓవైపు సీబీఎస్‌ఈ పరీక్షలు జరుగుతుండగా, ఎన్నికల శిక్షణకు ఎలా హాజరుకావాలంటూ డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. మండలంలోని టీచర్లందరూ ఎన్నికల శిక్షణకు హాజరైతే సీబీఎస్‌ఈ వార్షిక పరీక్షలు ఎవరు నిర్వహిస్తారన్నారు. ఇదే విషయాన్ని డీఈవో దృష్టికి తాము తీసుకెళ్లామని, ఎన్నికల శిక్షణను వాయిదావేయాలని కోరామన్నారు. దీనిపై డీఈవో ఎస్.అబ్రహం వివరణ ఇస్తూ 'ఎన్నికల విధులపై శిక్షణ తరగతులు మూడు, నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. ఇప్పుడు జరుగుతున్న సీబీఎస్‌ఈ పరీక్షలకు ఎక్కడా ఆటంకం కలుగనివ్వం. ప్రతీ స్కూలునుంచి ఎన్నికల శిక్షణకు ఉదయం సగంమంది టీచర్లు, మధ్యాహ్నం మిగతా సగంమంది టీచర్లు హాజరైతే సరిపోతుంది. ఈ మేరకు ఎంఈవోలకు, హెచ్‌ఎంలకు ఆదేశాలుకూడా ఇచ్చాం. పరీక్షల నిర్వహణకు ఇక సమస్య తలెత్తదు' అని అన్నారు.

ఎన్నికల తరువాతే మాధవాయిపాలెం రేవు పాట

» వచ్చే నెలనుంచి పాటదారుడికే నిర్వహణ బాధ్యతలు

నరసాపురరం, మార్చి 12: మాధవాయిపాలెం రేవు పాట కొత్త మలుపు తిరిగింది. ఎన్నికల కోడ్ వస్తున్నందున టెండర్ ప్రక్రియను వాయిదా వేయాలని మంగళవారం సమావేశమైన జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సోని అధ్యక్షతన జేఏసీ సమావేశమైంది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పాట నిర్వహించాలని, అప్పటివరకు నిర్వహణ బాధ్యతలను ప్రస్తుత పాటదారుడికి అప్‌సెట్ ప్రైస్ అంటే గత ఏడాది పాటదారుడు పాడిన మొత్తంలో నెలవారి లెక్కగట్టి ఆ మొత్తానికి పాటదారుడు ఒప్పుకుంటే అతడికే రేవు నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని తీర్మానించినట్టు ఎంపీడీవో రమణారావు తెలిపారు,

'పీహెచ్‌సీల్లో రిజిస్టర్లు విధిగా నిర్వహించాలి'



పీహెచ్‌సీలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న అధికారి విశ్వేశ్వరప్రసాద్

పాలకొల్లు రూరల్, మార్చి 12 :లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చింతపర్రు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో ఎన్‌హెచ్ ఎం టాస్క్‌ఫోర్స్ టీమ్ పలు ఆరోగ్య కార్యక్ర మాలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా స్టాటిస్టికల్ అధికారి విశ్వేశ్వరప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో ఆన్‌లైన్ యాప్‌లతోపాటు రికార్డులు, రిజిస్టర్లను విధిగా నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీమ్ అధికారులు వెంకటరత్నం, సురేష్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎలిజిబెత్, ఎస్‌కే అమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

22న నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ ఆస్తుల వేలం

» కోటపాడు ఎస్టేట్‌కు పరిహారం చెల్లింపులో జాప్యం

» 40 ఏళ్లుగా సాగిన వ్యాజ్యంపై కోర్టు నోటీసు



నూజివీడు, మార్చి 12: నూజివీడులోని కోటపాడు ఎస్టేట్‌కు చెల్లించాల్సిన పరిహారం విషయంలో నూజివీడు ఆర్డీవో కార్యాలయ ఆస్తులను (కంప్యూటర్లు, టేబుల్స్, జీపులు వగైరా) వేలం వేయాల్సిందిగా నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నోటీసు జారీ చేసింది. కోటపాడు ఎస్టేట్‌కు సంబంధించి వారసులు మేకా రాజ్యలక్ష్మి తాయారమ్మకు సంబంధించిన ఎకరా 21 సెంట్ల భూమిని, అందులోని భవనాన్ని 1972లో జిల్లా పరిషత్ కార్యాలయ భవనాల నిమిత్తం ప్రభుత్వం తీసుకుంది. సంబంధిత ఆస్తుల నష్టపరిహారం విషయంలో కోటపాడు ఎస్టేట్ వారసులకు, ప్రభుత్వానికి మధ్య వ్యాజ్యం దాదాపు 40 ఏళ్లు సాగి, సంబంధిత నష్ట పరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను నూజివీడు ఆర్డీవో (సబ్ కలెక్టర్) కార్యాలయ ఆస్తులను ఈనెల 22న ఉదయం 10.30 గంటలకు వేలం వేసి సదరు సొమ్మును వారసులకు జమ చేయాలని నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నోటీస్ జారీ చేసింది.

1979లో భూమికి సంబంధించిన నష్టపరిహారం చెల్లించాల్సిందిగా కోటపాడు ఎస్టేట్ వారసులు మేకా రాజ్యలక్ష్మి తాయారమ్మ కోర్టుకు వెళ్లారు. గజానికి వెయ్యి రూపాయలు చొప్పున రూ.2 కోట్ల 72 లక్షలు చెల్లించాలని ఆదేశిస్తూ ఎల్‌ఏవోపీ నంబర్ 80/2002లో ద్వారా కోర్టు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాలతో నాడు కేవలం రూ.14 లక్షలు మాత్రమే చెల్లించి ప్రభుత్వ అధికారులు చేతులు దులుపుకున్నారు. మిగిలిన బకాయి చెల్లింపులకు 2002 నుంచి న్యాయస్థానం పలుమార్లు నోటీసులను జారీ చేసింది. అయితే నాటి నుంచి అధికారులు ఆ నోటీసులకు సమాధానం ఇవ్వకుండా అలసత్వం ప్రదర్శించడంతో ఈనెల 22న సబ్ కలెక్టర్ కార్యాలయ ఆఫీస్ సామగ్రిని వేలం వేసి బాకీ కింద సొమ్మును జమ చేయాలని నూజివీడు కోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది.



కోడేరు ఇసుక ర్యాంపు

ఇసుక ర్యాంపులు తెరవాలి

» భవన నిర్మాణాల దృష్ట్యా ఇసుకకు పెరిగిన డిమాండ్

» కొన్ని నెలలుగా ఆచంట నియోజకవర్గంలో మూతపడిన ర్యాంపులు

» ఇదే అదనుగా దోపిడీకి పాల్పడుతున్న అక్రమార్కులు

ఆచంట, మార్చి12 : వేసవి సమీపిస్తున్నందున ఎక్కడ చూసినా అనేక నిర్మాణాలు జరుగుతుండంతో ప్రస్తుతం ఇసుకకు మహా డిమాండ్ ఏర్పడింది. ఆచంట నియోజకవర్గంలో సిద్ధాంతం, నడిపూడి, కోడేరు, కరుగోరుమిల్లి ర్యాంపులున్నాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జేపీ సంస్థకు ఇసుక ర్యాంపుల బాధ్యత అప్పగించారు. నియోజకవర్గంలో మొదట్లో ర్యాంపులు పని చేయడంతో ఇసుక కొరత తీరింది. ఇటీవల గోదావరి వరదల అనంతరం మళ్లీ ర్యాంపులు పని చేయలేదు. ఇదే అదనుగా భావించి అధికార పార్టీ నాయకులు నడిపూడి ర్యాంపుపై కన్నేసి అక్రమ ఇసుక దందాకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారు. అనేకసార్లు జిల్లాస్థాయి అధికారులు సైతం ఈ ర్యాంపుపై దాడులు చేసి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. అటువంటప్పుడు ఇసుక తరలింపు మానేయడం, మళ్లీ యథావిధిగానే అక్రమార్కులు ఇసుక దందాకు పాల్పడుతూనే ఉన్నారు. నియోజకవర్గంలోని ఈ ర్యాంపులలో రాత్రి సమయాల్లో అధికార పార్టీ నేతలు గుట్టుచప్పుడుగా ఇసుక దందాలకు పాల్పడుతున్నట్టు సమాచారం. జిల్లాలో ప్రతీ చోట నిర్మాణ పనులు అధికంగా జరుగుతున్న దృష్ట్యా ఇసుక కొరత తీరాలన్నా.. అక్రమ ఇసుక దందా నియంత్రించాలన్నా.. ప్రభుత్వం మళ్లీ ర్యాంపులు ప్రారంభిస్తే ఇసుక కొరతతో పాటు అక్రమ దందాను నియంత్రించవచ్చని పలువురు భావిస్తున్నారు.

జగనన్న ఎన్నికల రిజిస్ట్రేషన్లు





లబ్ధిదారుల పడిగాపులు

స్థలాలు చూపించకుండానే ప్రక్రియ వేగవంతం

ఎన్నికల ప్రచార సంబరాల సభలుగా.. వార్డులు, పంచాయతీలలో జగనన్న ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ హడావుడిగా నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల జగనన్న ఇళ్ల స్థలాల్లో పూడికలు లేకపోయినా, గృహ నిర్మాణం పూర్తికాకపోయినా పేదలకు ఇళ్లు నిర్మించామంటూ వైసీపీ నేతల అబద్ధపు ప్రచారం ముమ్మరం చేస్తూ ఎన్నికల్లో లబ్ధిపొందాలని ఆరాటపడుతున్నారు.

» రెండోసారి ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు హడావుడి

» మూడున్నరేళ్ల కిందటే స్థలాల ధ్రువీకరణలు.. ప్రస్తుతం ఆర్భాటంగా పంపిణీ..

భీమవరం మార్చి12 : పేరుకు జగనన్న ఇళ్ల స్థలాలు.. పేదల కోసం ఇల్లు నిర్మించామంటూ పూడికలు లేకపోయినా, గృహ నిర్మాణం పూర్తికాకపోయినా వైసీపీ నేతలు అబద్ధపు ప్రచారం ముమ్మరం చేశారు. వాస్తవానికి చాలాచోట్ల కొనుగోలు చేసిన జగనన్న లే-అవుట్లలో పేర్లు నమోదైన లబ్ధిదారులకు స్థలాలు చూపించకుండానే రెండోసారి ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు హడావుడిగా స్థలాల రిజిస్ట్రేషన్‌లు చేపట్టేశారు. అందుకే వీటిని జగనన్న ఎన్నికల రిజిస్ట్రేషన్‌లు అంటూ సెటైర్లు వేస్తున్నారు. 2020 జగనన్న లే-అవుట్ల కోసం భూసేకరణ పూర్తి చేసి, రెవెన్యూ శాఖ ద్వారా లబ్ధిదారుల పేర్లతో హడావుడిగా తయారుచేసిన స్థలాల ధ్రువీకరణలు ఆర్భాటంగా పంపిణీ చేశారు. వీటిలో గృహనిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం జిల్లాలో ఇవి 30 శాతం పనులు పూర్తయ్యాయి. కొద్దిరోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని హడావుడిగా మేల్కొని ఈ ఏడాది జనవరి నుంచి ఆ ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. జిల్లా యంత్రాంగం అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆయా సచివాలయాలలో హడావుడిగా రిజిస్ట్రేషన్ చేయించి వార్డుల వారీగా వలంటీర్ల పర్యవేక్షణలో పంపిణీ చేపట్టారు.

వార్డులు, పంచాయతీలలో పట్టాల పంపిణీ

వార్డులు, పంచాయతీలలో ఇళ్ల స్థలాల పట్టాలను మొదటగా ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించి, లబ్ధిదారులకు అందజేసే పని స్థానికంగా చిన్నచిన్న నాయకులకు అప్పగిస్తున్నారు. ఎన్నికలు సమీపించడంతో ఈ కార్యక్రమాన్ని కూడా ఎన్నికల ప్రచార సంబరాల సభలుగా మార్చి పట్టాలు పంపిణీ చేస్తున్నారు. జగనన్న గృహాలను నిర్మించేశామంటూ అబద్ధపు ప్రచారాలు చేయడం విమర్శలకు తావిస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో నవరత్నాలలో భాగంగా పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కార్యక్రమానికి 76 వేల మంది లబ్ధిదారుల ఇళ్ల పట్టాలు అర్హత కలిగి ఉన్నారు. గతనెల రెండో తేదీ నాటికి అన్ని డాక్యుమెంట్లతో 55,500 పట్టాల రిజిస్ట్రేషన్లకు సిద్ధంగా ఉన్నాయని ఆ రోజు అప్పటి కలెక్టర్ పి.ప్రశాంతి నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం నివేదిక సమర్పించింది. నిర్దేశించిన తేదీలోపుగా (అంటే ఎన్నికల నోటిఫికేషన్ తేదీ వచ్చే లోపు) రిజిస్ట్రేషన్లన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ సీరియస్‌గా ఆదేశించారు. ఈనెల రోజుల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ 50 శాతం పూర్తయింది. రిజిస్ట్రేషన్ పూర్తయిన పట్టాలను వార్డులలో, పంచాయతీలో ఎన్నికల సమావేశాలు పెట్టి పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 76 వేలు గృహాల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం 26 వేల గృహాలు మాత్రమే పూర్తయ్యాయి.

అబద్ధపు ప్రచారం..

జగనన్న ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ సమావేశాలలో పేదలందరికీ గృహాలు నిర్మించేసినట్టు అబద్ధపు ప్రచారాలు ముమ్మరం చేశారు. మరోవైపు జిల్లాలో 61,050 వేల ప్లాట్లకు మ్యాపింగ్ కార్యక్రమం పూర్తి చేశారు. ఇంకా 5,550 వేల ప్లాట్లకు మ్యాపింగ్ జరగవలసి ఉంది. నిర్మాణం ప్రారంభంకాని లే-అవుట్లలో సరిహద్దులను ఇంకా నిర్ణయించలేదు. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీ నాయకులు జగనన్న గృహ నిర్మాణంపై, పట్టాల రిజిస్ట్రేషన్‌పై ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

మంచి మనసున్న నటుడు హీరో కృష్ణ

» భీమవరంలో డాక్టర్ ఘట్టమనేని కృష్ణ కాంస్య విగ్రహం ఏర్పాటు



కృష్ణ విగ్రహాన్నిఅవిష్కరిస్తున్న ఆయన సోదరుడు ఆదిశేషగిరిరావు

భీమవరంటౌన్, మార్చి 12:'సువర్ణాక్షరాలతో అభిమానుల గుండెల్లో నిలిచిన నటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని.. ఓ హీరోగానే కాదు వ్యక్తిగతంగా మంచి మనసున్న నటుడు' అని సినీ నిర్మాత, కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆది శేషగిరిరావు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ అన్నారు. భీమవరం ప్రభుత్వాస్పత్రి రోడ్డులో డాక్టర్ ఘట్టమనేని కృష్ణ కాంస్య విగ్రహాన్ని మంగళవారం వారు ఆవిష్కరించారు. ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ వెండితెరపై సూపర్ స్టార్ కృష్ణ పేరు చెరగని ముద్ర అని, సాహసాలకు, సంచలనాలకు కృష్ణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారన్నారు. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ కష్టకాలంలో నిర్మాతలను ఆదుకున్న గొప్ప హీరో అని, అందుకే ఆయనను నిర్మాతల హీరో అని అంటారన్నారు. కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, కాంస్య విగ్రహ నిర్వాహకుడు రాయప్రోలు శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాల పాటు కృష్ణతో అనుబంధం ఉందని, ఆయన పేరిట సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అనంతరం నిర్మాతలు ఆది శేషగిరిరావు, భరద్వాజ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో చలసాని శ్రీనివాస్, వేగేశ్న కనక రాజుసూరి, రాయప్రోలు భగవాన్, కృష్ణ మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు సుబ్బరాజు, బోణం ప్రసాద్, గంట్ల ప్రసాద్, భట్టిప్రోలు శ్రీనివాస రావు, తోట భోగయ్య, కామన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తణుకు, మార్చి 12: తణుకు రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని కాల్దరి-నిడదవోలు స్టేషన్ల మధ్య రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. మృతుడు నీలం రంగు లుంగీ, తెలుపు రంగు పూల డిజైన్ గల పొడుగు చేతుల చొక్కా, మబ్బు రంగు డ్రాయరు ధరించి ఉన్నాడు. ఛాతీపై కుడిపక్కన, వీపుపై పుట్టుమచ్చలు ఉన్నాయని, భీమవరం రైల్వే ఎస్ఐ రమణ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 70939 39777 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెంటపాడు, మార్చి 12 : కలుపు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలోని మౌంజిపాడుకు చెందిన పోట్రు శ్రీను(45) మద్యానికి బానిసై ఇంటిని పట్టించుకోకుండా తిరుగుతుండేవాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 10వ తేదీన భార్యతో పాటు ఆమె బంధువులు మద్యం తాగిన శ్రీనును గట్టిగా నిలదీశారు. అదేరోజు రాత్రి మనస్తాపంతో కలుపుమందు తాగగా చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతడు మంగళవారం మృతి చెందాడని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పెంటపాడు ఎస్ఐ మోహన్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెనుమంట్ర, మార్చి 12:పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు మంగళవారం వేగంగా ఢీ కొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. వివరాలివి.. ఈ ప్రమాదంలో బ్రాహ్మణ చెరువు గ్రామానికి చెందిన కడలి గోవింద్ తలకు తీవ్ర గాయం కాగా మరో బైక్‌పై వున్న సుమారు 35 ఏళ్ల వయసు గల తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన వ్యక్తి తలకు తీవ్రమైన గాయమై అధిక రక్తస్రావమైంది. స్థానికులు పెనుమంట్ర 108 వాహనానికి సమాచారం అందించగా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కృష్ణ, పైలట్ బ్రహ్మాజీ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన వైద్యం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ వీఆర్‌ఏ మృతి



సుబ్బారావు (ఫైల్)

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 12 : గురవాయిగూడెం వీఆర్‌ఏ కొదమ సుబ్బారావు(50) ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. గురవాయిగూడెంలో ఈనెల 5వ తేదీన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో సుబ్బారావు తీవ్రంగా గాయప డ్డారు. స్థానికులు వైద్యం నిమ్మిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించగా అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందారు. వీఆర్‌ఏ కొదమ సుబ్బారావుకు ఐదుగురు కుమారులు, భార్య ఉన్నారు.

గల్ఫ్ నుంచి మహిళ మృతదేహం



రోజాకుమారి (ఫైల్)

మొగల్తూరు, మార్చి12 : జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లిన ఓ మహిళ మృతి చెందడంతో మంగళవారం ఆమె భౌతిక కాయాన్ని కేపీపాలెంలోని ఆమె స్వగృహానికి తీసుకువచ్చారు. వివరాలివి.. కేపీపాలెం గ్రామానికి చెందిన గుబ్బల రోజా కుమారి(35) పద్నాలుగు నెలల క్రితం జీవనోపాధికై ఖత్తర్ దేశానికి వెళ్లింది. ఇటీవల ఆమె అనారోగ్యం పాలవ్వడంతో ఈనెల 2న మృతి చెందారు. భర్త పెద్దిరాజు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆమెకు గల ఇద్దరు కుమార్తెలు 6, 8 తగరగతులు చదువుతున్నారు. ఆమె మృతి సమాచారం తెసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు గల్ఫ్ ప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే ప్రసాదరాజు చొరవతో స్వస్థలానికి తీసుకువచ్చారు.

పట్టుబడిన పోలీస్ ఇళ్లల్లో ఏసీబీ అధికారుల సోదాలు

నరసాపురం, మార్చి 12: లంచం తీసుకుంటూ పట్టుబడిన పోలీసుల ఇళ్లల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి పలు డాక్యుమెంట్లను గుర్తించినట్టు తెలిసింది. సోమవారం నరసాపురం టౌన్‌పోలీస్ స్టేషన్‌లో 498 కేసులో రూ.25వేలు లంచం తీసుకుని ఎస్ఐ ప్రసాద్, రైటర్ నాగేశ్వరరావు, డ్రైవర్ ప్రసాద్ ఏసీబీకి చిక్కిన విషయం విదితమే.. ఉన్నతాధికారుల ఆదేశాలతో రాత్రి వీరి ముగ్గురు ఇళ్లల్లో ఏసీబీ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పలు డాక్యుమెంట్లను గుర్తించినట్టు తెలియవచ్చింది. వీటిపై ఏసీబీ అధికారులు మాత్రం ఎటువంటి ప్రకటన చేయలేదు. ఉన్నతాధికారులకు నివేదించి, వారి అనుమతితోనే వివరాలు వెల్లడిస్తామన్నారు.

దళారుల గుండెల్లో దడ..

ఏసీబీ అధికారుల దాడులతో ఇప్పటివరకు ఈ స్టేషన్లలో మధ్యవర్తులుగా వ్యవహరించిన కొందరి దళారుల గుండెల్లో దడ పుడుతోంది. తమ పేర్లు ఎక్కడ బయటపడతాయోనని ఆందోళన చెందుతున్నారు. వీరిలో ఇద్దరు ఇప్పటికే పట్టణం నుంచి జారుకున్నట్లు తెలిసింది. ఈక్రమంలో ఎన్నికల నేపథ్యంలో గతంలో పని చేసిన అధికారులంతా బదిలీ అయి కొత్త సిబ్బంది వచ్చారు. వారికి ఈస్టేషన్ పరిస్థితి భిన్నంగా కనిపిస్తుంది. ఎక్కడైన అధికారులపై రాజకీయ ఒత్తిడి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం దళారుల జోక్యమే ఎక్కువగా కనిపిస్తుండటంతో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఒక అధికారి ఒక దళారి వ్యవహారంపై పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అన్నికేసుల్లో అతడి జోక్యం ఉంటుందని ఉన్నతాధికా రులకు నివేదించినట్టు తెలిసింది. అంతే కాకుండా ఈ దళారిని స్టేషన్‌లోకి కూడా రానివ్వడం లేదు. సర్కిల్ పరిధిలో మిగిలిన స్టేషన్లకు కూడా ఈ దళారిపై కన్నేసి ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. మరోవైపు ఈ దళారిపై పోలీస్ ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. గతంలో అతడు చేసిన వ్యవహారాలను నివేదించాలని నిఘా వర్గాలను ఆదేశించారు.

సెల్‌ఫోన్ తెచ్చిన తంటా..!

» పోలీస్‌స్టేషన్‌కు బాలుర తరలింపు

» కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తామన్న పోలీసులు

పాలకోడేరు, మార్చి 12 :సెల్‌ఫోన్ ఎంత ఉపయోగకరమో అన్ని అనర్థాలు ఉంటాయనడానికి శృంగవృక్షంలో మంగళవారం జరిగిన ఘటనే నిదర్శనం. శృంగవృక్షంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు బాలికలు విజయవాడ, మంగళగిరి గ్రామానికి చెందిన యువకులతో కొంత కాలంగా చాటింగ్ చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆ బాలికల ప్రోత్సాహంతో ఆ ఇద్దరు బాలురు కలిసి విజయవాడ మంగళగిరి నుంచి శృంగవృక్షం హైస్కూల్ వద్దకు చేరుకుని బాలికల కోసం వేచి చూస్తున్నారు. ఇది గమనించిన స్థానికులు ఆ ఇద్దరు బాలురిని నిర్బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాలురను స్టేషన్‌కు తీసుకువెళ్లి వారి తల్లిదండులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

సోషల్ మీడియాలో హల్‌చల్..

అమ్మాయిలను కిడ్నాప్ చేసేందుకు వచ్చారంటూ.. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సోషల్‌మీడియాలో వాయిస్ మెయిల్ హల్‌చల్ చేయడంతో పెద్ద చర్చనీయాంశమైంది.

బాలుడి అదృశ్యం.. కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 12 : ఇంటి నుంచి ఓ బాలుడు అర్ధరాత్రి వేళ వెళ్లిపోయాడని తల్లి ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం గ్రీన్‌సిటీ ప్రాంతానికి చెందిన గంట్రేటి వెంకటనాగఫణీంద్ర(14) ఎనిమిదోవ తరగతి చదువుతున్నాడు. ఈనెల 10వ తేదీ అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడికోసం వెతికినప్పటికీ ఆచూకీ కానరాకపోవడంతో తల్లి నాగమణి ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రాజారెడ్డి తెలిపారు.

నిరుపయోగంగా ఆక్వా ల్యాబ్.. శిక్షణ కేంద్రం

» గత ప్రభుత్వ హయాంలో కోటి రూపాయలతో నిర్మాణం

» ప్రస్తుతం ఆక్వా రైతులకు ఉపయోగపడని వైనం

» తాళాలు వేస్తున్నారని రైతుల ఆగ్రహం



ఆకివీడులో ఆక్వా ల్యాబ్ తాళం వేసి వున్న మైక్రోబయోలజీ గది

ఆకివీడు, మార్చి 12: ఆకివీడులో ఆక్వా ల్యాబ్.. శిక్షణ కేంద్రం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వంలో కోటి రూపాయలు నిధులతో నిర్మించిన ఆక్వా ల్యాబ్ శిక్షణా కేంద్రం వైసీపీ పాలనలో నిరుపయోగంగా ఉంది. అంతంత మాత్రంగా ఉన్న ఆక్వా పరిశ్రమకు ఉచితంగా ల్యాబ్ పరీక్షలు చేయాల్సి, సలహాలు ఇవ్వాల్సిన కేంద్రం నిరుపయోగంగా మారడంతో ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్‌కు వెళితే సమాధానం చెప్పే వారు ఉండరు. ఎప్పుడూ తాళాలు వేచి ఉంటున్నాయని రైతులు ఆగ్రహిస్తున్నారు. మైక్రోబయోలజీ, నీరు, మట్టి, మేత ప్రయోగశాల గదులకు తాళాలు వేచి ఉంటున్నాయి. ఈ ల్యాబ్‌కు మత్స్యశాఖాధికారితో పాటు సిబ్బంది ఉన్నారు. ఉద్యోగులు వేలకు వేలు రూపాయలు జీతాలు పొందుతున్నారని, బయట పరీక్షలు చేయించుకుంటుంటే జేబులకు చిల్లులు పడుతున్నాయని ఆక్వా రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించిన సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

జీడిమామిడి పంటలో అధిక లాభాలు

» ఉపకులపతి డాక్టర్ జానకీరామ్



పుస్తకాల కిట్‌లను రైతులకు అందిస్తున్న ఉపకులపతి డాక్టర్ జానకీరామ్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 12: జీడిమామిడి పంటకు యాజమాన్య పద్ధతులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ద్వారా అధిక లాభాలు ఆర్జించ వచ్చని ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ పేర్కొన్నా రు. వెంకట్రామన్న గూడెంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఐసీఏఆర్ సహకారంతో ఏడాదిగా నిర్వహిస్తున్న జీడిమామిడిలో అధిక దిగుబడి, యాజ మాన్య పద్ధతులపై శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దిద్దుకూరు, తెల్లవారిగూడెం, వంకావారిగూడెం, దాట్లవారిగూ డెం, వాడపల్లి గిరిజన ప్రాంతాల్లో నిర్వహించిన రైతుశిక్షణ కార్యక్రమాలపై రై తులు హర్షం వ్యక్తం చేశారు. జీడిమామిడి సాగు, యాజమాన్య పద్ధతులపై రచించిన మూడు పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం పుస్తకాల కిట్‌లను రైతులకు అందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ ఏఎస్ పద్మావతమ్మ, ప్రాజెక్టు పరిశోధకులు ఎం.కల్పణ, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

వాహనాల వేలం ఆదాయం రూ.9.58 లక్షలు



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ సిబ్బంది

చింతలపూడి, మార్చి 12 : చింతలపూడి ఎస్‌ఈబీ సర్కిల్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన 40 వాహనాలను మంగళవారం వేలం వేయగా జీఎస్టీతో కలిపి 9 లక్షల 58 వేల 126 రూపాయల ఆదాయం వచ్చిందని చింతలపూడి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.ఎస్.ఎస్.వి.ప్రసాద్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టుబడిన బెల్లం 2,519 కిలోలు, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిల్లో పట్టుబడిన నాలుగు కేసుల్లోని 42 మద్యం సీసాలు, 29 కేసుల్లో పట్టుబడిన 341 మద్యం సీసాలు, 45 కేసుల్లో 755 లీటర్ల నాటు సారాను ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున మద్యం, సారా అక్రమ రవాణా అరికట్టేందుకు జిల్లాలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, దీనిలో భాగంగా ఈ సర్కిల్‌లో లింగగూడెం, అల్లిపల్లి, లంకాలపల్లి గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అక్రమ మద్యం నిల్వ ఉన్నా, రవాణా చేస్తున్నా 94409 02434, 94409 02425 నంబర్లకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

హోంమంత్రి సభలో వీఆర్‌వో భర్తకు అస్వస్థత



వీఆర్‌వో భర్తను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

ద్వారకాతిరుమల, మార్చి12: హోంమంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో ద్వారకాతిరుమలలో మంగళవారం జరిగిన చేయూత కార్యక్రమంలో వీఆర్‌వో మహాలక్ష్మి భర్త గుండె పట్టుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గుండెపోటు వచ్చిందని పార్టీ నేతలు హుటాహుటిన ఆయనను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ద్వారకాతిరుమల వీఆర్‌వోగా పనిచేస్తున్న మహాలక్ష్మికి సహాయంగా భర్త సోమసుందరం మంగళవారం సభాప్రాంగణంలో ఉన్నారు. ఎండ తీవ్రంగా ఉండడంతో పాటు నీరసించి గుండెపోటు వచ్చిందంటూ కుప్పకూలారు. స్థానిక నేతలు ఆయనను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వడదెబ్బగా నిర్ధారించి తగిన చికిత్స చేశారు.

బలివే ఉత్సవాల ఆదాయం రూ.41.50 లక్షలు

ముసునూరు, మార్చి 12: బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులపాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలకు 41 లక్షల 50 వేల 360 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. ఖాళీ స్థలాల అద్దె రూ.13 లక్షలు, కొబ్బరి చెక్కల వేలంతో రూ. 1,12,000, స్వామివారి దర్శనం టిక్కెట్ల ద్వారా రూ 12,36,498లు, హుండీ ఆదాయం రూ.14,47,371లు, లడ్డూ ప్రసాదం అమ్మకాలతో రూ.54,500 లభించిందని, గత ఏడాది ఉత్సవాల ఆదాయం కంటే ఈ ఏడాది ఆదాయం రూ. 7 లక్షలు పెరిగిందని ఈవో తెలిపారు.

డీఈవో పాఠశాలల తనిఖీ

చాట్రాయి, మార్చి 12: జిల్లా విద్యాశాఖాధికారి కె.అబ్రహం, నూజివీడు డీవైఈవో సేవ్యా నాయక్ మంగళవారం మర్లపాలెం, ఉప్పరపాలెం ప్రాథమిక స్కూళ్లు, పోలవరం జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ బుక్స్ నాడు-నేడు పనులు పరిశీలించారు. ఎంఈవో బ్రహ్మచారి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఆకివీడు, మార్చి 12: ఆర్టీసీ కొత్తబస్టాండ్‌లో అడ్డుగా పెట్టిన మోటారు సైకిల్‌ను ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొంది. బస్సు టైరు పేలి పెద్దశబ్ధం రావడంతో చుట్టుప్రక్కల ప్రజలు, ప్రయాణికులు భయాందోళన చెందారు. భీమవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఏలూరు నుంచి భీమవరం వస్తుంది. ఆకివీడులో దిగుమతి చేసేలా రెండు మూటల పువ్వులు ఏలూరులో వేశారు. పూలకొట్టు వర్తకులు పువ్వులు దించుకునేందుకు ఆకివీడు కొత్తబస్టాండ్‌కు చేరుకుని బైక్‌ను బస్టాండ్ ఆవరణలో పెట్టి మూటలు దించుకున్నారు. కండక్టర్ రైట్ చెప్పడంతో ప్రమాదవశాత్తు పక్కన పెట్టిన బైక్‌ను ఢీకొన్నాడు. బైక్ సైలెన్సర్‌కు గార్డు బస్సు టైర్‌ను కోయడంతో పేలి పెద్ద శబ్ధం వచ్చింది. బస్సులో వున్న సుమారు 88 ప్రయాణికులు, విద్యార్థులు భయాందోళనతో కిందకు దిగారు. కొంతసేపు ఘర్షణ వాతావరణం నెలకొనడంతో డ్రైవరు పోలీసులను ఆశ్రయించాడు. కండక్టర్ ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించి పంపించేశాడు. బస్టాండ్‌లో కంట్రోలర్ లేకపోవడంతో చాలా అనర్థాలు జరుగుతున్నాయని, బస్టాండ్‌లో తాగునీరు కూడా లేదని ఇప్పటికైనా స్పందించి అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

మతోన్మాద పార్టీలకు వ్యతిరేకంగా పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న వనజ

ఏలూరు టూటౌన్, మార్చి 12: మతోన్మాద పార్టీలు, వారితో పొత్తు పెట్టుకున్న పార్టీలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వనజ మాట్లాడుతూ ఇండియా కూటమిలోని సీపీఐ, సీపీఎంకు మద్దతు తెలపాలన్నారు. ప్రజాసమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు బీజేపీ ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర విభజన హామీలు గాలికి వదిలేసిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం నిరంతర పోరాటం



మహిళలతో మాట్లాడుతున్న హైమావతి

ఏలూరు టూటౌన్, మార్చి 12: మహిళా హక్కుల కోసం 35 ఏళ్లుగా ఐద్వా నిరంతర పోరాటం చేస్తుందని జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి అన్నారు. ఐద్వా ఆవిర్భావ దినోత్సవం గన్ బజార్‌లో మంగళవారం నిర్వహించారు. హైమావతి మాట్లాడుతూ చిన్నారులు, మహిళలకు భద్రత లేదని, పాలకులు సిగ్గుపడాలన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే మహిళా సాధికారత గుర్తుకొస్తుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువయ్యాయన్నారు. మహిళల దుస్తులు, దేవాలయాల్లో మహిళల ప్రవేశంపై అనేక ఆంక్షలు విధిస్తున్నారన్నారు. సనాతన ధర్మం పేరుతో మూఢ భావాలు తీసుకురావాలని చూస్తున్నారన్నారు. సుకన్య, వెంకటరమణ, కొండమ్మ, సుజాత, పైడమ్మ, భవాని, మేరీ, రాజేశ్వరి పాల్గొన్నారు.

బంజారాలు అన్ని రంగాల్లో రాణించాలి



ఐక్యత చాటుతున్న బంజారాలు

టి.నరసాపురం మార్చి 12: బంజారాలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ సర్పంచ్ జరభల పూర్ణయ్య నాయక్ అన్నారు. కృష్ణాపురంలో బంజారా బజరంగీ భేరి నూతన కమిటీని పూర్ణయ్య నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జరభల చందా నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా వేణుగోపాల్ నాయక్, కోశాధికారిగా ధరావత్తు రవి నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చందా నాయక్, వేణుగోపాల్ మాట్లాడుతూ బంజారాల పురాణ పురుషుడు వీర హనుమాన్ నడిచిన ధర్మమార్గంలో బంజారా జాతిని నడపడమే సంఘ కర్తవ్యం అన్నారు.

ఆర్టీసీ ఉత్తమ మహిళా కండక్టర్లకు నగదు పురస్కారం



మహిళా కండక్టర్‌కు బహుమతుల పంపిణీ

ఏలూరు రూరల్, మార్చి 12: ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో మంగళవారం మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఏలూరు రూరల్ మహిళా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షురాలు కూరాళ్ళ రమాదేవి మాట్లాడుతూ మహిళలు సామాజిక సేవల్లో సైతం ముందడుగు వేస్తున్నారన్నారు. పీటీడీ జిల్లా అధికారి ఎన్‌బీఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ పురుషులతో సమానంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం సామాన్య విషయం కాదన్నారు. ఉత్తమ మహిళా కండక్టర్లకు నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు. శివరాత్రి సందర్భంగా ఎక్కువ ఆదాయం తీసుకువచ్చిన డ్రైవర్లను, కండక్టర్లను సత్కరించారు. డిపో మేనేజరు డి.వాణి, జంగారెడ్డిగూడెం డిపో మేనేజరు ఎ.గంగాధర్, సీహెచ్.పవన్‌కుమార్, డీపీటీవో సూపరింటెండెంట్ వేణుగోపాలరావు, పీఆర్వో కేఎల్‌వీ.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఉండాలి



సత్కారం అందుకున్న మహిళలు

ఉంగుటూరు, మార్చి 12: సమాజాభివృద్ధికి మహిళలు ఎంతో కృషి చేస్తున్నారని, వారు వివిధ రంగాలలో ఉన్నతికి చేరుకోవాలని తాడేపల్లిగూడెం ఉప విద్యా శాఖాధికారి ఎన్.రవీంద్ర భారతి అన్నారు. నారాయణపురం వివేకానంద జడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా వివిధ రంగాలలో సేవలందించిన 19 మంది మహిళలను సత్కరించారు. ఎంఈవో-2 కాండ్రేగుల శ్రీనివాసరావు, అడపా శోభారాణి, శీతాల సత్యనారాయణ, యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఉనుముల రాంబాబు, సుభాషిణి, కనకదుర్గ, అల్లు శ్రీను, హరికృష్ణ పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

ఉంగుటూరు, మార్చి 12: కీటక జనిత వ్యాధులపై మలేరియా అధికారి వై.వీ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల గృహ యజమానులను కలసి ఇంటి పరిసరాలలో నీటి నిల్వతో దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వారానికి ఒకసారి డ్రైడే పాటించాలని సూచించారు. ఆరోగ్య కార్యదర్శులు పి.విజయకుమారి, గంగ, ఎంఎల్‌హెచ్‌పిలు సునీత, మౌనిక, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశాలు, అంగన్వాడీ వర్కర్లు ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 905మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 12: ఇంటర్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ప్రథమ సంవత్సరం భౌతిక శాస్త్రం, అర్థశాస్త్రం పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయని డీవీఈవో ప్రభాకరరావు తెలిపారు. జనరల్ విభాగంలో 13,982 మంది, ఒకేషనల్ విభాగంలో 1962 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.



లింగపాలెం మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న రోషన్‌కుమార్



జీలుగుమిల్లి కార్యాలయం వద్ద మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు

లింగపాలెం, మార్చి 12: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. అయ్యప్పరాజుగూడెం, అన్నపనేనివారిగూడెం, ఘనపనేనివారిగూడెం, కుప్పాలవారిగూడెం గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ అరాచకాలు ప్రజలకు అనేక కష్టాలు మిగిల్చాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలకు సరైన రోడ్లు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా జగన్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పేదల కనీస అవసరాలు కూడా తీర్చలేని జగన్ రెడ్డికి ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. అయ్యప్పరాజుగూడెం ప్రగతిపురం కాలనీ విద్యార్థులకు బస్సు సౌకర్యం లేదని, ఉన్నత తరగతులకు కనీసం 4 కిలోమీటర్లకు పైగా నడిచి వెళితే బస్సు అందుబాటులోకి ఉంటుందని వాపోయారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైన మొదటి నెలలోనే గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని రోషన్ కుమార్ హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గరిమెళ్ళ చలపతిరావు, మూల్పూరి మురళి, సుసాని సాంబశివరావు, మేడికొండ ప్రసాద్, గుత్తా సత్యసాయివరప్రసాద్, గారపాటి బుజ్జియ్య, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, మోరంపూడి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు, అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తాం

జీలుగుమిల్లి : పోలవరం నియోజకవర్గ అసెంబ్లీ టిక్కెట్ ఉమ్మడి అభ్యర్థి ఎవరైనా గెలిపించి తీరుతామని టీడీపీ మండల నాయకులు స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ జనసేన బీజేపీ తరుపున అధిష్ఠానం నిర్ణయం మేరకు టిక్కెట్ ఎవరికి ఇచ్చినా గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ జడ్పీటీసీ బాసిన రాజబాబు, మాజీ ఎంపీపీ గూడపాటి అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ చిర్రి వెంకటేశ్వరావు, మనమా వెంకటేశ్వరావు, గన్నమని సతీష్, కొర్లపాటి సునీల్, గూడపాటి పుల్లయ్య, తమ్మన సాంబ, తమ్మన నాగేశ్వరావు, దొంగా మురళీ, వల్లభనేని గంగాదర్, వెలగల అజయ్, బుడిపుటి చిరంజీవి, పద్దం వెంకట కృష్ణ, జి.లక్ష్మీనారాయణ, బిక్కిన వెంకటేశ్వరావు, జుజ్జువరపు నరసింహమూర్తి, పాలగాని రామకృష్ణ, ఉలవల రమణ, ఉండవల్లి కిరణ్ ఉన్నారు.

● టి.నరసాపురం: అధిష్ఠానం నిర్ణయం శిరోధార్యమని మాజీ జడ్పీటీసీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా ఏ పార్టీకి సీటు ఇచ్చినా ఆ నియోజకవర్గ అభ్యర్థిని గెలిపించడానికి పార్టీ శ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం సర్వతోముఖాభి చంద్రబాబుతోనే సాధ్యం అన్నారు. ఏలూరు జిల్లాలోని పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం సహా రాష్ట్రంలో పొత్తు ధర్మాన్ని పాటించాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాయకులకు, కార్యకర్తలకు అధినేత సముచిత స్థానం కల్పిస్తారని ఆయన తెలిపారు. పొత్తులో త్యాగాలు తప్పవని కార్యకర్తలు విజ్ఞతతో ఆలోచించాలని హితవు పలికారు. నాయకులు కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రైల్వే పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న డీఆర్ఎం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 12: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్-వికసిత్ రైల్వేస్' అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఏలూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమాల సందర్భంగా డివిజినల్ రైల్వే మేనేజర్ నరేంద్ర పాటిల్ బహుమతులను అందజేశారు. వ్యాసరచనలో పవన్‌కుమార్, హేమవర్థిని, తేజశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. వక్తృత్వ పోటీలో హాస్యసుమ, భువన పద్మశ్రీ, ప్రతిమ బహుమతులు అందుకున్నారు. ముఖ్యఅతిథి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానిస్తూ నిర్వహించిన స్వాగత నృత్యప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులకు కూడా నరేంద్రపాటిల్ జ్ఞాపికలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రైల్వే అధికారులు, హెచ్ఎం సత్యశారద, మదనమోహనరాజు పాల్గొన్నారు.

అంగన్వాడీ శిశువులకు గొడుగుల పంపిణీ



గొడుగులు అందజేస్తున్న ఆప్తమిత్ర డైరెక్టర్

పోలవరం, మార్చి 12: మండలంలో అంగన్వాడీ శిశువులకు ఆప్తమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ముచ్చిక రంజిత్ కుమార్ దొర మంగళవారం గొడుగులు పంపిణీ చేశారు. ఆప్తమిత్ర సంస్థ స్థాపించి 12 ఏళ్లయిన సం దర్భంగా మండలంలో అంగన్వాడీల్లో పిల్లలకు గొడుగులు, పాదరక్షలు పంపి ణీ చేయనున్నట్లు తెలిపారు. తొలివిడతగా పోలవరం మండలంలో చేగొండ పల్లి, శింగన్నపల్లి, మామిడిగొంది అంగన్వాడీల శిశువులకు గొడుగులు పంపి ణీ చేసినట్లు తెలిపారు. సంస్థ సభ్యులు ముచ్చిక శివకుమార్, యోగీశ్వర దొర, మడకం రామారావు తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణ సొమ్ము చెల్లించాలి

కుక్కునూరు, మార్చి 12: అమరవరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో తునికాకు సేకరించిన కార్మికులకు సొమ్ము చెల్లించాలని కోరుతూ మంగళవారం అమరవరం అటవీ రేంజ్ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఎస్కె గౌస్ మాట్లాడుతూ రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే కార్మికులు తునికాకు సేకరిస్తుంటే కూలీ డబ్బులు ఇవ్వకుండా నెలల తరబడి ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. గతంలో రావలసిన తునికాకు బోనస్ ఇంతవరకు ఇవ్వలేదన్నారు. 50 ఆకుల తునికాకుల కట్టకు రూ.5 ఇవ్వాలన్నారు. వారం వారం తునికాకు కార్మికులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. బాదినేని సత్యనారాయణ, కొండ ప్రసాదు, కోసయ్య ,రాజు, అడమయ్య పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్ల పూర్తి

పెదపాడు, మార్చి 12: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో ఎస్.నరసింహమూర్తి తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారుల సమక్షంలో పరీక్షా ప్రతాలు మొదటి సెట్‌ను పోలీస్‌స్టేషన్లో భద్రపరిచామన్నారు. మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలల నుంచి 588 మంది, 10 ప్రైవేటు పాఠశాలల నుంచి 430 మంది పరీక్షలకు హాజరు కానున్నారని నరసింహమూర్తి తెలిపారు.

సీఏఏ చట్టంపై హర్షం

ఏలూరు కల్చరల్, మార్చి 12: కేంద్రం సీఏఏ చట్టాన్ని తీసుకురావడంపై హిందు ధర్మ రక్షణ సమితి హర్షం ప్రకటించింది. కెఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, చేదులూరి గౌరయ్య మాట్లాడుతూ సీఏఏ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడం హర్షణీయమన్నారు.

రంజాన్ ఉపవాస ప్రార్థనలు



ఇఫ్తార్ విందులో ముస్లింలు

పోలవరం, మార్చి 12: రంజాన్ ప్రారంభం సందర్భంగా మంగళవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలో జమాతె మసీదు, గూటాల, పట్టిసీమ, ఎల్ఎన్‌డీపేట మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందులు ఆరగించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండి యాసీన్ షరీఫ్ మాట్లాడుతూ రంజాన్ ప్రార్థనలలో సుమారు 1500 మంది పాల్గొన్నారని తెలిపారు.

నారాయణపురం డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లు

ఉంగుటూరు, మార్చి 12: నారాయణపురం డిగ్రీ కళాశాలకు పీఎం ఉష కేంద్ర పథకంలో భాగంగా రూ.5.కోట్ల నిధులు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు, కొండా రవి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం నిర్మాణం నిమిత్తం రూ1.7 కోట్లు, మహిళా వసతి సముదాయం నిర్మాణానికి రూ.1.2 కోట్లు, కంప్యూటర్ ఆధారిత తరగతికి రూ.98 లక్షలు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.1.2 కోట్లు మంజూరైనట్లు వివరించారు. విద్యతో పాటు క్రీడా శిక్షణకు ఈ కళాశాలకు ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉందని వారు వివరించారు.

నర్సింగ్ విద్యార్థినులకు క్షేత్రస్థాయి శిక్షణ

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 12 : నర్సింగ్ విద్యార్థినులు సేవా దృక్పథం కలిగి ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా మంగళవారం స్థానిక గజ్జలవారిచెర్వు అర్బన్ పీహెచ్‌సీని సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, పల్స్‌పోలియో వ్యాక్సినేషన్, చికన్ గున్యా, మలేరియా, డెంగీ, అంటువ్యాధుల గురించి విద్యార్థినులకు వివరించారు. వైద్యాధికారి బాలకృష్ణ, వైద్యసిబ్బంది శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

15న సెయింట్ థెరిస్సాలో మినీ జాబ్‌మేళా

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 12: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15న సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.సుధాకర్ మంగళవారం తెలిపారు. టెక్నోటాస్క్, హెటిరో ల్యాబ్స్, ఇన్నోవసోర్స్ కంపెనీల్లో సుమారు 320 ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్ విద్యార్హతలుండి, 18-35 సంవత్సరాల వయస్సుగల అభ్యర్థులు మినీ జాబ్‌మేళాకు బయోడేటా, సర్టిఫికెట్ల నకళ్లతో హాజరుకావచ్చునన్నారు. వివరాలకు ఫోన్‌నెంబర్లు 94934 82414, 96663 22032, 96525 03799లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



మానవత చైర్మన్ పుష్పావతికి సత్కారం

ఏలూరు రూరల్, మార్చి 12: సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కళాశాలలో మానవత ఉమ్మడి జిల్లా చైర్మన్ కోడూరి రాధా పుష్పవతి కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి విద్యార్థి లక్ష్యం నిర్దేశించుకుని నిరంతరం పట్టుదలతో కృషిచేయాలని సూచించారు. సోషల్ మీడియాతో కాలాన్ని వృథా చేసుకుంటున్నారని సెల్, ఇంటర్నెట్ విజ్ఞానం కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం అకడమిక్ సెమిస్టర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జ్ఞాపికలు అందజేశారు. ఆలపాటి నాగేశ్వరరావు, అడుసుమిల్లి నిర్మల, మేతర అజయ్‌బాబు, పి.రత్నాకర్‌రావు, సోమ్లా నాయక్, ఎ.కృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



బడేటి చంటి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ఏలూరు టూటౌన్, మార్చి12: టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో వైసీపీ కార్యకర్తలంతా కూటమి వైపు ఆకర్షితులవుతున్నారని బడేటి చంటి అన్నారు. 2వ డివిజన్‌లో ఎన్.గంగాధర్, చిన్నారావు, పీ.శ్రీనివాస్, నాగమణి, ఏ.సాయి నాయకత్వంలో వందలాది మంది మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. 23వ డివిజన్‌లో బి.లక్ష్మణ్, షేక్ సోను, ఎం.దుర్గాప్రసాద్, షేక్ ఖదీర్‌తో పాటు వందలాదిగా టీడీపీలోకి వచ్చారు. కట్టా సుబ్బారావుతోటలో జరిగిన సభలో బడేటి చంటి వారందరికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చంటి మాట్లాడుతూ వైసీపీని నమ్మి ఓట్లు వేసి ప్రజలంతా మోసపోయామని గ్రహించారన్నారు. ధరల పెరుగుదలతో సామాన్యుల జీవితాలు తల్లకిందులయ్యాయని, బతకలేని పరిస్థితి వచ్చిందన్నారు. జనసేన, టీడీపీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ చారిత్రాత్మకమైందన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని నియోజకవర్గ ప్రజలను మోసగిస్తున్నాడని అన్నారు. శంకుస్థాపనలతో ప్రజలను మభ్యపెడుతున్నాడన్నారు. ఐదేళ్లుగా ఎక్కడా అభివృద్ధి లేదని, ఇప్పుడు అభివృద్ధి పేరుతో శిలాఫలకాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. టీడీపీ కూటమి విజయం తథ్యమని రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమైందన్నారు.

నాచుగుంటలో జనంలోకి జనసేన



ధర్మరాజుకు మహిళల హారతి

ఉంగుటూరు, మార్చి 12: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన సాగిస్తోందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని ఇంటికి సాగనంపాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పిలుపు నిచ్చారు. మండలంలోని నాచుగుంట గ్రామ శివారు కొత్తగూడెంలో మంగళవారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే ఎదురు దాడులకు దిగడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఆయన వెంట ఉంగుటూరు, భీమడోలు మండలాల అధ్యక్షులు పంది రాంబాబు, పత్తి మదన్, పగడాల ప్రసాద్, గుండాబత్తుల బాలాజి, మారిశెట్టి మణి, చెన్నా మణి, కాగిత అంజి, టీడీపీ నాయకులు వేమన త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సాయుధ దళాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ దళాలు

లింగపాలెం, మార్చి 12: ధర్మాజీగూడెం, రంగాపురం, కలరాయునిగూడెం గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ దళాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన రంగాపురం, ధర్మాజీగూడెం, కలరాయునిగూడెం గ్రామాల్లో సీఐ సుధాకర్, ఎస్సై చెన్నారావు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

● భీమడోలు: చెట్టున్నపాడు, ఆగడాలలంక, గుండుగొలను గ్రామాల్లో మంగళవారం పారా మిలటరీ దళాలు కవాతు నిర్వహించారు. భీమడోలు సీఐ రవికుమార్ మాట్లాడుతున్న రానున్న సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్ఐ సుధాకర్, సిబ్బంది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న చైతన్య

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 12 : చదువుతో పాటు క్రీడలలో విద్యార్థులు రాణించాలని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మద్దిపాటి చైతన్య అన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రెండో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. అనంతరం మసీదు సెంటర్ నుంచి హైస్కూల్ వరకు స్కూల్ విద్యార్థులు స్కేటింగ్ చేస్తూ క్రీడా స్ఫూర్తిని చాటారు. విద్యార్థుల స్కేటింగ్ ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.

ఆలయ నిర్మాణానికి రూ.25 వేలు విరాళం



విరాళం అందజేస్తున్న మాగంటి బాబు

ఏలూరు టూటౌన్, మార్చి 12: లింగపాలెంలో ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీ మాగంటి బాబు రూ.25 వేలు విరాళం అందించారు. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరావు, గంటా శ్రీనివాసరావు, రఘునాథ్‌రెడ్డి, గోలి శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీలు వేంకటేశ్వరస్వామి దేవస్థానం, కోదండ రామాలయ కమిటీలు మాగంటి బాబును మంగళవారం కలిశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** గాంధీనగర్ రామమందిరం ప్రాంగణంలోని షిరిడీ సాయి మందిరం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాబాకు పంచామృతాభిషేకం అనంతరం విశేష అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. పల్లకీ సేవా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- నరసింహారావుపేట దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పుష్పాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.
- **ఏలూరు ఎడ్యుకేషన్ :** ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా పోణంగి వైఎస్సార్ కాలనీలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. నిర్వాహకులు కె.పద్మావతి, సీఆర్ఆర్, సెయింట్ థెరిస్సా కళాశాలల ప్రతినిధులు బ్యూలా, స్వరూపరాణి, లావణ్య, సరస్వతి, అనురాధ, పావని, గీత, దంతవైద్యురాలు చందన, తదితరులు పాల్గొన్నారు.
- **కామవరపుకోట:** టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ నేతలు జేతిన వెంకట్రావు, తూతా లక్ష్మణరావు, రవి మంగళవారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.
- **పెదపాడు :** ఏపూరు - 1 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. వైద్యాధికారి చక్రధర్ ఆరోగ్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.
- **పెదవేగి :** శివాలయంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.
- పెదవేగిలోని శివాలయంలో ఐదు రోజులపాటు ప్రతిరోజు ఉదయం స్వామివారికి నిత్యార్చన, ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించినట్లు అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు.
- **లింగపాలెం :** ధర్మాజీగూడెంలో వెంపా దుర్గారావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆశ్రం ఆస్పత్రి వైద్యులు సేవలందించారు. పలువురు గ్రామస్థులు పరీక్షలు చేయించుకున్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిని ఆశ్రం ఆసుపత్రికి తీసుకువెళతామన్నారు.
- **భీమడోలు :** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తెలిపారు. భీమడోలులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. పెదలింగంపాడులో ఓహెచ్ఎస్ఆర్ ఓవర్ ట్యాంక్ ప్రారంభోత్సవం, మార్కెట్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన, బీసీ కాలనీలో బోరు, భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్‌వరకూ రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం





పుష్పగుచ్ఛంతో గవర్నర్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు



అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

ఏలూరు రైల్వే స్టేషన్ గూడ్స్‌షెడ్డు ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీస్ గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య కళా ప్రదర్శన ఆకట్టుకుంది.







పట్టుబడిన పోలీస్‌ల ఇళ్లల్లో ఏసీబీ అధికారుల సోదాలు

నరసాపురం, మార్చి 12: లంచం తీసుకుంటూ పట్టుబడిన పోలీసుల ఇళ్లల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి పలు డాక్యుమెంట్లను గుర్తించినట్టు తెలిసింది. సోమవారం నరసాపురం టౌన్‌పోలీస్ స్టేషన్‌లో 498 కేసులో రూ.25వేలు లంచం తీసుకుని ఎస్ఐ ప్రసాద్, రైటర్ నాగేశ్వరరావు, డ్రైవర్ ప్రసాద్ ఏసీబీకి చిక్కిన విషయం విదితమే.. ఉన్నతాధికారుల ఆదేశాలతో రాత్రి వీరి ముగ్గురు ఇళ్లల్లో ఏసీబీ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పలు డాక్యుమెంట్లను గుర్తించినట్టు తెలియవచ్చింది. వీటిపై ఏసీబీ అధికారులు మాత్రం ఎటువంటి ప్రకటన చేయలేదు. ఉన్నతాధి కారులకు నివేదించి, వారి అనుమతితోనే వివరాలు వెల్లడిస్తామన్నారు.

దళారుల గుండెల్లో దడ..

ఏసీబీ అధికారుల దాడులతో ఇప్పటివరకు ఈ స్టేషన్లలో మధ్యవర్తులుగా వ్యవహరించిన కొందరి దళారుల గుండెల్లో దడ పుడుతోంది. తమ పేర్లు ఎక్కడ బయటపడతాయోనని ఆందోళన చెందుతున్నారు. వీరిలో ఇద్దరు ఇప్పటికే పట్టణం నుంచి జారుకున్నట్టు తెలిసింది. ఈక్రమంలో ఎన్నికల నేపథ్యంలో గతంలో పని చేసిన అధికారులంతా బదిలీ అయి కొత్త సిబ్బంది వచ్చారు. వారికి ఈస్టేషన్ పరిస్థితి భిన్నంగా కనిపిస్తుంది. ఎక్కడైన అధికారులపై రాజకీయ ఒత్తిడి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం దళా రుల జోక్యమే ఎక్కువగా కనిపిస్తుండటంతో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఒక అధికారి ఒక దళారి వ్యవహారంపై పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అన్నికేసుల్లో అతడి జోక్యం ఉంటుందని ఉన్నతాధికా రులకు నివేదించినట్టు తెలిసింది. అంతే కాకుండా ఈ దళారిని స్టేషన్‌లోకి కూడా రానివ్వడం లేదు. సర్కిల్ పరిధిలో మిగిలిన స్టేషన్లకు కూడా ఈ దళారిపై కన్నేసి ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. మరోవైపు ఈ దళారిపై పోలీస్ ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. గతంలో అతడు చేసిన వ్యవహారాలను నివేదించాలని నిఘా వర్గాలను ఆదేశించారు.

సెల్‌ఫోన్ తెచ్చిన తంటా..!

» ఇద్దరు బాలురు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

పాలకోడేరు, మార్చి 12 :సెల్‌ఫోన్ ఎంత ఉపయోగకరమో అన్ని అనర్థాలు ఉంటాయనడానికి శృంగవృక్షంలో మంగళవారం జరిగిన ఘటనే నిదర్శనం. శృంగవృక్షంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు బాలికలు విజయ వాడ, మంగళగిరి గ్రామానికి చెందిన యువకులతో కొంతకాలంగా చాటింగ్ చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆ బాలికల ప్రోత్సాహంతో ఆ ఇద్దరు బాలురు కలిసి విజయవాడ మంగళగిరి నుంచి శృంగవృక్షం హైస్కూల్ వద్దకు చేరుకుని బాలికల కోసం వేచి చూస్తున్నారు. ఇది గమనించిన స్థానికులు ఆ ఇద్దరు బాలురిని నిర్బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాలురను స్టేషన్‌కు తీసుకువెళ్లి వారి తల్లిదండులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

సోషల్ మీడియాలో హల్‌చల్..

అమ్మాయిలను కిడ్నాప్ చేసేందుకు వచ్చారంటూ.. పాఠశాల విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సోషల్‌మీడియాలో వాయిస్ మెయిల్ హల్‌చల్ చేయడంతో పెద్ద చర్చనీయాంశమైంది.

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయరూ!



పైప్‌లైన్ నుంచి లీకవుతున్న తాగు నీరు

నూజివీడు టౌన్, మార్చి 12: దిగవల్లి శివారు కండ్రిక దిగవల్లి గ్రామంలో తాగునీటి పైప్ పాడై దాదాపు ఐదునెలలు గడుస్తున్నా గ్రామ సచివాలయ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నీటి సరఫరా సమయంలో పాడైన పైప్‌లైన్ నుంచి నీరు వృథాగా బయటకుపోతుండగా సరఫరా నిలిపివేసిన సమయంలో లీకైన నీరు పైప్‌లోకి వెళ్లి త్రాగునీరు కలుషితం అవుతోందని, దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. తక్షణం పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

డీఈవో పాఠశాలల తనిఖీ



చాట్రాయి, మార్చి 12: జిల్లా విద్యాశాఖా ధికారి కె. అబ్రహం, నూజివీడు డీవైఈవో సేవ్యా నాయక్ మంగళవారం మర్లపాలెం, ఉప్పరపాలెం ప్రాథమిక పాఠశాలలు, పోల వరం జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ బుక్స్, నాడు-నేడు పనులు పరిశీలించారు. ఎంఈవో బ్రహ్మచారి, హెచ్ఎంలు పాల్గొన్నారు.



భద్రాచలానికి కాలినడకన..

చాట్రాయి, మార్చి 12: మండలంలోని మర్లపాలెం రామాలయం నుంచి మంగళవారం తెల్లవారు జామున 60 మంది రామభక్త బృందం కాలినడకన భద్రాచల రాముడి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. జై శ్రీరామ్, జై హనుమాన్ అని నినాదాలు చేస్తూ వెళ్లారు. భక్త బృందం సభ్యుడు, ఉప సర్పంచ్ వెల్డి రాజారావు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి క్రమం తప్పకుండా భద్రాచలం కాలి నడకన వెళుతున్నామని, దారిలో పలు ఆలయాలు సందర్శిస్తూ గురువారం భద్రాచలం వెళ్లి రాములవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటామని చెప్పారు. నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి తమ బృందానికి భద్రా చలంలో వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు.

కేవీపీని కలసిన అశోక్



నూజివీడు, మార్చి 12: నూజివీడు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు మద్దతు ఇవ్వాలని నూజివీడుకు చెందిన వ్యాపారవేత్త అశోక్ మచ్చా కాంగ్రెస్ మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావును కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ఢిల్లీలో రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసి నూజివీడు నియోజకవర్గ పరిస్థితులపై చర్చించినట్టు అశోక్ వివరించారు.

విద్యార్థులకు మానవత ప్రోత్సాహక బహుమతులు



కలిదిండి, మార్చి 12 : తాడినాడ జడ్పీ హైస్కూల్ 8, 9, 10 తరగతుల మెరిట్ విద్యార్థులకు మానవత సేవా సంస్థ ప్రోత్సాహక బహుమతు లను మంగళవారం అందించింది. మానవత అధ్యక్షుడు గోదావరి సత్యనారాయణ, చైర్మన్ పేటేటి వివేకానంద, సభ్యులు చిట్టూరి బాలకృష్ణ, మారుబోయిన రత్నారావు, గొరిపర్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

ముదినేపల్లి, మార్చి 12 : పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లింలు మంగళవారం నుంచి ప్రారంభించారు. ముదినేపల్లి మసీదులో నమాజ్ నిర్వహించి ఖురాన్ పఠనం చేశారు. మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ ఫతే అహ్మద్, కార్యదర్శి సిద్దిఖ్ ఆధ్వర్యంలో ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్ష అనంతరం మసీదు వద్ద ఇఫ్తార్ విందు చేశారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

నూజివీడు టౌన్, మార్చి 12: వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కార్యాలయంలో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైసీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కో ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీ, మాజీ మున్సిపల్ చైర్మన్ మద్దిరాల కోటమ్మ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెర్వును తలపిస్తున్న రహదారి

» రహదారిని ఆక్రమించి చేపల చెరువులు తవ్విన ఫలితం?

» గుంతల్లోకి ఊట నీరు చేరుతోందంటున్న గ్రామస్థులు

» అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



చెరువును తలపిస్తున్న మట్టగుంట – పెదలంక ప్రధాన రహదారి

కలిదిండి, మార్చి 12 : మట్టగుంట - పెదలంక ప్రధాన రహదారి గుంతల్లో నీరు నిల్వ ఉండి చెరువును తలపిస్తోంది. రహదారి మార్జిన్‌లో చేపల చెరువులు తవ్వటంతో చెరువుల్లో నీరు రోడ్డుపై గుంతల్లోకి చేరి నిల్వ ఉండి బురదకయ్యగా మారాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకులు, మహిళలు, వృద్ధులు ఈ రహ దారిపై రాకపోకలు సాగించటానికి నరకయాతన అనుభవిస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి రహదారి వెంబడి చేపల చెరువులు తవ్వటం వల్లే రహదారి ధ్వంసమై పెద్ద గోతులు పడి చెరువులను తలపిస్తు న్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. చేపల చెరువుల్లో ఊట నీరు గుంతల్లో చేరుతుండటంతో పలు వాహనాలు గుంతల్లో దిగబడుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కామినేని



చెక్కపల్లిలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

సుపరిపాలకులనే ఎన్నుకోవాలి

కైకలూరు, మార్చి 12: సుపరిపాలన అందించే వారికే ఓట్లు వేసి గెలిపించు కోవాలని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దొడ్డిపట్ల గ్రామంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వరహాపట్నంలోని ఆయన ఇంటి నుంచి అభిమానులు వందలాది మంది బైక్ ర్యాలీగా దొడ్డిపట్ల గ్రామానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, కైకలూరు నియోజకవర్గంలోనూ రౌడీ రాజకీయాలు పెరిగిపో యాయని ఈ పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలంతా విజ్ఞతతో ఓట్లు వేయా లన్నారు. టీడీపీ-బీజేపీ-జనసేన పొత్తుతో రాష్ట్రానికి మేలు జరుగుతుంద న్నారు. ఎన్నికల అనంతరం చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్ర సహకారం చాలా అవసరమన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలనను తరిమి కొట్టాలంటే ప్రజలంతా ఏకతాటిపైకి రావాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు, తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, టీడీపీ నాయకుడు టీకేఎం నాని, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, పార్టీ గ్రామ నాయకులు గొట్టుముక్కల బాపిరాజు, కోనాల జోషి, ఆగోళ్ళ బలేస్వామి, వేటుకూరి పెద్దిరాజు, సాయల మాచిరాజు, ఆగోళ్ళ జీవనబాబు, గొట్టుముక్కల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి దళితులు గుణపాఠం చెప్పాలి

కలిదిండి: వైసీపీ దళితులను విస్మరించిందని కామినేని అన్నారు. మంగళవారం వెంకటాపురంలో జరిగిన దళిత ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ వారి సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచిందన్నారు. ఎస్సీఎస్టీ, మైనార్టీలపై దాడులు పెరిగాయ న్నారు. దళిత ద్రోహి సీఎం జగన్‌కు ఎన్నికల్లో దళితులంతా ఐక్యంగా గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్లు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేరా రమేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడు కొండలు, ఉపాధ్యక్షుడు బళ్ల రాజు, నాయకులు సుధ, జాన్ రాజ్, కృపారావు, లీలా కనకదుర్గ, అంద్రాజు శ్రీనివాస్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికే సూపర్‌సిక్స్ పథకాలు

ముసునూరు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టారని కాపు కార్పొరేషన్ మండల మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు మామిడిశెట్టి గిరిబాబు అన్నారు. మంగళ వారం చెక్కపల్లిలో సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేసి, చంద్రబాబు సీఎం కావాల్సిన అవశ్యకతను టీడీపీ నాయకులు ప్రజలకు వివ రించారు. గిరిబాబు మాట్లాడుతూ ఈ సూపర్ సిక్స్ పథకాల అమలు సాధ్యం కాదని జగన్‌రెడ్డి చెబుతున్న అసత్యాలు నమ్మ వద్దన్నారు. సంపద సృష్టించి, సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతగా అమలు చేయగల నాయకుడు చంద్రబాబు అన్నారు. నాయకులు కంచి రాఘవేంద్రరావు, చేపూరి శ్రీనివాసరావు, తోట జగన్‌మోహన్‌రావు, కుమారస్వామి, తోట సత్యనారాయణ, మామిడిశెట్టి నాగేశ్వరరావు, దార రవీంద్రనాథ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



బడుగుల అభ్యున్నతికి పాటుపడిన పూలే

» శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు

కైకలూరు, మార్చి 12: బడుగుల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీ యుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. మంగళవారం కైకలూరు-కోరుకొల్లు రోడ్డు సెంటర్లో పూలే విగ్రహాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి పూలే చేసిన సేవలు అభినందనీ యమన్నారు. వైసీపీ నాయకుడు కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్, నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కిడ్నీ వ్యాధులపై అవగాహన ర్యాలీ

నూజివీడు టౌన్, మార్చి 12: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిడ్నీవ్యాధులపై అవగాహన కల్పిస్తూ నూజివీడు ఏరియా ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాథమిక దశలోనే వైద్యసేవలు పొందితే సంతోషకరమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అపోలో డయాలసిస్ ఆధ్వర్యంలో అధునాతన డయాలసిస్ సేవలను రోగులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు నరేంద్రసింగ్, డయాలసిస్ యూనిట్ ప్రతినిధి రాహుల్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పార్థసారథిని కలసిన చాట్రాయి తెలుగు తమ్ముళ్లు

చాట్రాయి, మార్చి 12: నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథిని మంగళవారం చాట్రాయి టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ అంబటి సత్యనా రాయణ (చంటి), నాయకులు కమ్మల కొండలరావు, రాయవరపు పల్లారావు, తుమ్మల చిన్న సాంబశివరావు, శ్రీరాముల సత్యనారాయణ, గోల్కొండ రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు పార్థసారథికి వివరించినట్లు నాయకులు తెలిపారు.

అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం

ముదినేపల్లి రూరల్, మార్చి 12: టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా కైకలూరు నియోజకవర్గ సీటును ఎవరికి కేటాయించినా అదిష్ఠాన నిర్ణయమే శిరోధార్యమని జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు దావు నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభ్యర్థి ఎవరైనా పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని పేర్కొన్నారు. పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేకుండా సమష్టిగా పనిచేసి అదిష్ఠానం సూచించిన అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు.



జయంతి వేడుకల్లో పాల్గొన్న మహిళలు, విద్యార్థులు

రామకృష్ణ పరమహంసకు ఘన నివాళి

కైకలూరు, మార్చి 12: రామకృష్ణ పరమహంస 189వ జయంతిని మంగళవారం కైకలూరులోని రామకృష్ణ సేవా సమితిలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కడిమిళ్ళ వరప్రసాద్ ప్రవచనాలు చేశారు. పరమహంస జీవితాశయాలు మహోన్నతమైనవని నేటి యువత వాటిని అనుసరించి సన్మార్గంలో పయనించాలని వక్తలు సూచించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిగీతాలు ఆలపించి, పూజలు నిర్వహించి విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. సేవా సమితి అధ్యక్షుడు భూపతిరాజు వెంకటేశ్వర వర్మ, సెక్రటరీ యు. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించి భక్తులను ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

సీఆర్పీఎఫ్ బలగాల కవాతు



చాట్రాయి, మార్చి 12: మండలంలోని సమస్యా త్మక గ్రామాలైన కోట పాడు, పోలవరంలలో మంగళవారం నూజివీడు సీఐ రామకృష్ణ, ఎస్సై కేసీ హెచ్ స్వామి ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ బలగాలు కవా తు నిర్వహించాయి. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించటా నికి ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఏఎస్ఐ గజపతి రావు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

రోగికి దాతల చేయూత



చాట్రాయి, మార్చి 12: మండలంలోని పోలవరం గ్రామంలో పక్షవాతంతో మంచానికే పరిమితమై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కంకోళం సుబ్బరాజుకు చిన్నం పేట గ్రామానికి చెందిన కొమ్ము ఆనందం, పలగాని శ్రీనివాసరావు, బి. రామకృష్ణ, కె. నాగేశ్వరరావు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మందులు, నిత్యావసర సరుకులు అందజేశారు. బాధితుడి భార్య సునీత మాట్లాడుతూ తన భర్తను నిరంతరం కనిపెట్టుకొని సేవలు అందించవ లసి ఉన్నందున కూలి పనులకు వెళ్ళటం లేదని, దాతలు ఆర్థికంగా సాయపడాలని అర్థించింది.

ఎమ్మెల్యే పార్థసారథి కరెంటు స్తంభాల వితరణ



ఆగిరిపల్లి, మార్చి 12: ఆగిరిపల్లి 4వ వార్డుకు నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్ కొలుసు పార్థసారథి 20 కరెంటు స్తంభాల కొనుగోలుకు ఆర్థిక సాయం చేశారు. ఈ నెల 6న కార్యకర్తల సమన్వయంలో భాగంగా ఆగిరిపల్లిలో 4వ వార్డు సందర్శించారు. ప్రజల అభ్యర్థన మేరకు కరెంటు స్తంభాల ఆవశ్యకతను గుర్తించి వెంటనే రూ.80 వేలు ఆర్థిక సాయం చేశారు. మంగళవారం నుంచి కరెంటు స్తంభాలు ఏర్పాటు చేస్తామని గ్రామ టీడీపీ అధ్యక్షుడు పామర్తి నర్సయ్య, చౌటపల్లి విక్టర్ తెలిపారు.

22న నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ ఆస్తుల వేలం

» కోటపాడు ఎస్టేట్‌కు పరిహారం చెల్లింపులో జాప్యం

» 40 ఏళ్ళుగా సాగిన వ్యాజ్యంపై కోర్టు నోటీసు



నూజివీడు, మార్చి 12: నూజివీడులోని కోటపాడు ఎస్టేట్‌కు చెల్లించాల్సిన పరిహారం విషయంలో నూజివీడు ఆర్డీవో కార్యాలయ ఆస్తులను (కంప్యూటర్లు, టేబుల్స్, జీపులు వగైరా) వేలం వేయాల్సిందిగా నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నోటీసు జారీ చేసింది. కోటపాడు ఎస్టేట్‌కు సంబంధించి వారసులు మేకా రాజ్యలక్ష్మి తాయారమ్మకు సంబంధించిన ఎకరా 21 సెంట్ల భూమిని, అందులోని భవనాన్ని 1972లో జిల్లా పరిషత్ కార్యాలయ భవనాల నిమిత్తం ప్రభుత్వం తీసుకుంది. సంబంధిత ఆస్తుల నష్ట పరిహారం విషయంలో కోట పాడు ఎస్టేట్ వారసులకు, ప్రభుత్వానికి మధ్య వ్యాజ్యం దాదాపు 40 ఏళ్ల సాగి, సంబంధిత నష్ట పరిహారం చెల్లించటంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను నూజివీడు ఆర్డీవో (సబ్ కలెక్టర్) కార్యాలయ ఆస్తులను ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు వేలం వేసి సదరు సొమ్మును వారసులకు జమ చేయాలని నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నోటీస్ జారీ చేసింది.

1979లో భూమికి సంబంధించిన నష్టపరిహారం చెల్లించాల్సిందిగా కోటపాడు ఎస్టేట్ వారసులు మేకా రాజ్యలక్ష్మి తాయారమ్మ కోర్టుకు వెళ్లారు. గజానికి వెయ్యి రూపాయలు చొప్పున రూ.2 కోట్ల 72 లక్షలు చెల్లించాలని ఆదేశిస్తూ ఎల్ఏవోపీ నంబర్ 80/2002లో ద్వారా కోర్టు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాలతో నాడు కేవలం రూ.14 లక్షలు మాత్రమే చెల్లించి ప్రభుత్వ అధికారులు చేతులు దులుపుకున్నారు. మిగిలిన బకాయి చెల్లింపులకు 2002 నుంచి న్యాయస్థానం పలుమార్లు నోటీసులను జారీ చేసింది. అయితే నాటి నుంచి అధికారులు ఆ నోటీసులకు సమాధానం ఇవ్వకుండా అలసత్వం ప్రదర్శించడంతో ఈ నెల 22న సబ్ కలెక్టర్ కార్యాలయ ఆఫీస్ సామగ్రిని వేలం వేసి బాకీ కింద సొమ్మును జమ చేయాలని నూజివీడు కోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు తేల్చిన లెక్కల ప్రకారం కోటపాడు ఎస్టేట్ జమిందారీ వారసులు అయిన మేకా రాజ్యలక్ష్మి తాయారమ్మ, మేకా అమృత తదితరులకు సుమారు రూ.19 కోట్ల వరకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని, వారి తరఫు న్యాయవాది మురాల గోపీనాథ్ తెలిపారు. అయితే ఆక్షన్ పెట్టిన సామగ్రి నష్టపరిహారం నిర్ణయించిన మొత్తానికి సరిపోదని, మిగిలిన మొత్తం చెల్లింపునకు సంబంధించి 2.68 ఎకరాల్లోని నూజివీడు సబ్ కలెక్టర్ ఆఫీస్ పరిసర ప్రాంగణం, ప్రస్తుత భవనాలను సైతం వేలం వేసి తమకు నష్టపరి హారం ఇప్పించాలని కోరుతూ న్యాయస్థానంలో మరో పిటిషన్ దాఖలు చేసిన ట్లుగా గోపీనాథ్ తెలిపారు. నూజివీడు ప్రస్తుత ఆర్డీవో భవానీ శంకరి ఉన్నతాధికారుల దృష్టికి కోర్టు ఉత్తర్వుల విషయం తీసుకునివెళ్ళి ఆక్షన్ జరగకుండా, వారసులకు ప్రభుత్వం నుంచి సొమ్ము చెల్లించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

పోలీస్ స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు



ముసునూరు, మార్చి 12: ముసునూరు పోలీస్‌స్టేషన్‌కు పటిష్ట బందోబస్తు నడుమ పదవ తరగతి ప్రశ్నపత్రాలు మంగళవారం చేరాయి. రూట్ ఆఫీసర్ బీవీయస్ సుబ్బారావు ప్రశ్నాపత్రాలను పోలీసుల సమక్షంలో సీఎస్‌లు ఎ.జాన్‌సన్, సీహెచ్. దామోదరరావు, విజయకుమారిలకు అప్పగించారు. ఏడు సబ్జెక్టులకు సంబంధించిన మొదటి సెట్ ప్రశ్నాపత్రాలను సీఎస్‌లు రెండు ట్రంకుపెట్టెల్లో పెట్టి, సీల్ వేసి ఎస్ఐ పి.వాసు సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు.

చాట్రాయి: చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు భద్రపరిచినట్టు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. మంగళవారం సెట్-1 ప్రశ్నాపత్రాలు రాగా, బుధవారం సెట్-2 వస్తాయని చెప్పారు. మండలంలో చాట్రాయి జడ్పీ హైస్కూల్, ఆర్సీఎం స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు.

టెన్త్ పరీక్షార్థులు 3,345 మంది

నూజివీడు టౌన్, మార్చి 12: నూజివీడు డివిజన్‌లో మొత్తం 3,345మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్లు నూజివీడు డీవైఈవో సేవ్యా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూజివీడు డివిజన్ పరిధిలో మొత్తం నాలుగు మండలాలకు గాను 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో 3,345 మంది విద్యార్థులు పరీక్షలు రాయను న్నారన్నారు. ఆగిరిపల్లి మండలంలో మూడు, ముసునూరు మండలంలో మూడు, చాట్రాయిలో రెండు, నూజివీడులో 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఈ నెల 18 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 8 మంది విద్యార్థుల గైర్హాజరు

ముదినేపల్లి, మార్చి 12 : ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ కేంద్రంలో 136 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 128 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ బృందం ఈ కేంద్రాన్ని పరిశీలించింది.

బలివే ఉత్సవాల ఆదాయం రూ. 41.50 లక్షలు

ముసునూరు, మార్చి 12: బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులపాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలకు 41 లక్షల 50 వేల 360 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. ఖాళీ స్థలాల అద్దె రూ. 13 లక్షలు, కొబ్బరి చెక్కల వేలంతో రూ. 1,12,000లు, స్వామివారి దర్శనం టిక్కెట్ల ద్వారా రూ 12,36,498లు, హుండీ ఆదాయం రూ.14,47,371లు, లడ్డూ ప్రసాదం అమ్మకాలతో రూ.54,500లు లభించిందని, గత ఏడాది ఉత్సవాల ఆదాయం కంటే ఈ ఏడాది ఆదాయం రూ. 7 లక్షలు పెరిగిందని ఈవో తెలిపారు.

నేడు టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశం

చాట్రాయి, మార్చి 12: చీపురుగూడెంలో బుధవారం సాయంత్రం 5 గంట లకు టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశం జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి తెలిపారు. సమావేశానికి నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి హాజరవుతున్నారని మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు సమావేశానికి తరలివచ్చి జయప్రదం చేయాలని ఆమె కోరారు.

జన ఔషధి కేంద్రం ప్రారంభం

ముసునూరు, మార్చి 12: తక్కువ ధరకే మందులు అందించే జన ఔషధి కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరులో కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని వైసీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కానుమూరు సునీల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. సొసైటీ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు కె.అజయ్‌కుమార్, బీజేపీ నాయకులు గుడివాడ వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖుడు దేవినేని వరప్రసాదరావు, మాజీ సర్పంచ్ రేగుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం ముసునూరు వెలుగు కార్యాలయం వద్ద మండల స్థాయిలో వైఎస్ఆర్ చేయూత కార్యక్రమాన్ని ఏపీఎం బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. నాలుగో విడతగా 3797 మంది లబ్ధిదారులకు రూ. 7,11,93,750ల చెక్కును ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌తో కలసి డ్వాక్రా మహిళలకు అందజేశారు. అనంతరం మండల వ్యాప్తంగా 1079 మంది లబ్ధిదారులకు నివేశనా స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జడ్పీటీసీ ప్రతాప్, వైస్ ఎంపీపీలు కోటగిరి రాజా, పాముల గంగధరరావు, ఎంపీటీసీ చీలి లక్ష్మీ, ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి, తహసీల్దార్ జవహర్ బాజి, పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.